www.visalaandhra.com

శనివారం
03-09-2022

విజయవాడ ప్రచురణ

సంపుటి : 71, సంచిక : 73
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

అద్దె మోజు!

1000 బస్సులకు ఆర్టీసీ ప్రణాళిక

- పాతవి నవీకరణతోనే సరి
- యువతకు ఉద్యోగాలు ప్రశ్నార్థకం
- ప్రభుత్వంలో విలీనమైనా సమస్యలే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఏపీఎస్ఆర్టీసీ అద్దెబస్సుల మోజులో పడింది. డిసెంబరు నాటికి 1000 అద్దె బస్సుల టెండర్లకు ప్రణాళిక రూపొందించింది. ప్రయాణికుల అభిరుచికి తగిన విధంగా కొత్త బస్సుల పేరుతో అద్దె బస్సులకు యాజమాన్యం సన్నద్ధమైంది. ఇప్పటికే రెండు విడతలుగా టెండర్లు నిర్వహించి, అద్దె బస్సులు ఖరారు చేసింది. ఎంఎస్‌టీసీ-6 ద్వారా పిలిచిన టెండర్లలో 339 అద్దె బస్సులను కొత్తగా జూన్‌లో ప్రవేశపెట్టింది. ఆగస్టులో పిలిచిన టెండర్ల ద్వారా ఇప్పటివరకు మరో 156 బస్సులు ఖరారయ్యాయి. వాటితోపాటు జీసీసీ మోడల్‌పై 9 మీటర్ల పొడవుగల 100 ఏసీ విద్యుత్ బస్సుల సరఫరాకు యాజమాన్యం ఆదేశించింది. వాటిని తిరుమల-తిరుపతి ఘాట్‌రోడ్డు, తిరుపతి-నెల్లూరు, మదనపల్లి, కడప ఇంటర్ సిటీ మార్గాల్లో నడపనుంది. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైనప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వంలో విలీనంతో ఆర్టీసీ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని ఉద్యోగులు, ప్రయాణికులు ఆశించారు. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఆర్టీసీ తీవ్ర లోటుతో ఉంది. రెండేళ్లపాటు కరోనాతో ఆర్టీసీకి ఆదాయం తగ్గిపోయింది. తెలంగాణ ప్రభుత్వం విధించిన షరతులతో, ఏపీ-తెలంగాణ మధ్య గతం కంటే ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ప్రయాణ కిలోమీటర్లు తగ్గాయి. అనేక కారణాలతో సంస్థకు నష్టాలు వచ్చాయి. ఆర్టీసీ యాజమాన్యం వెనక్కి తగ్గకుండా ఆదాయ అన్వేషణ పద్ధతులు, విభిన్న పథకాలను ప్రవేశపెట్టి సంస్థను పరిరక్షిస్తున్నది. ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి రాగానే సీఎం జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో

- మిగతా 2 లో

మోదీ... ఎంత అబద్ధం!

- బంగ్లా స్వాతంత్ర్య పోరాటంలో జైలుకెళ్లానన్న ప్రధాని
- అసలు ఆ రికార్డే లేదన్న పీఎంఓ
- ఆర్టీఐ పిటిషన్ ద్వారా బయటపడిన వాస్తవం

న్యూదిల్లీ :
మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వాక్పటిమ గురించి.. ఉన్నవి లేనివి కలిపి అర్ధసత్యాలు, అవాస్తవాలతో అనర్గళంగా మాట్లాడగలిగే సత్తా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఈ మధ్యన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద చర్చకే దారితీశాయి. బంగ్లాదేశ్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గతేడాది ఆ దేశానికి వెళ్లిన ఆయన అక్కడ ప్రగల్భాలు పలికారు. తనకు ఎవ్వరు సాటి రారన్నట్లుగా గొప్పలు పోయారు. బంగ్లాదేశ్ విమోచనం కోసం జరిగిన సత్యాగ్రహంలో పాల్గొన్న కారణంగా జైలుకు వెళ్లానని చెప్పుకున్నారు. అప్పట్లో తన వయస్సు 20-22 ఏళ్లు అన్నారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటానికి మద్దతిచ్చి జైలుకు వెళ్లానని చెప్పారు. దీంతో ఈ మాటల్లో ఎంత నిజం ఉందని అనేక మంది ప్రశ్నించారు. ప్రామాణికత ఏమిటని అడిగారు. గతంలోనూ మోదీ ఇలాంటి చాలా కబుర్లు చెప్పారు. తన విద్యార్హతలు, టీ అమ్మడం వంటివి ఉదాహరణలు. 2016లో పెద్ద నోట్ల రద్దు, కోవిడ్‌పై పోరులో విజయం, పీఎం-కేర్స్ నిధి, భారతీయ వ్యూహాత్మక అడుగులు, ప్రతిస్పందనలు ప్రశ్నార్థకమే. అప్పట్లో భారత్-యూఎస్ఎస్ఆర్ మైత్రి ఒప్పందానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం జరిగింది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరంలో భాగంగా చేపట్టిన సత్యాగ్రహం క్రమంలో మోదీ జైలుకు వెళ్లినట్లు పీఎంఓ వద్ద ఎటువంటి రికార్డులు లేవని ఆర్టీఐ ద్వారా వెల్లడి అయింది. ఆర్టీఐ ప్రశ్నకు ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) స్పందిస్తూ మోదీ అరెస్టు కావడం, జైలుకు

- మిగతా 2 లో

సూకీకి మరో మూడేళ్ల జైలు

మైన్మార్:
ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో మైన్మార్ కోర్టు ఆంగ్ సాన్ సూకీకి మూడేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. ఇప్పటికే వివిధ కేసుల్లో ఆమెకు 17 ఏళ్ల జైలు శిక్షను ఈ తీర్పు జోడిస్తుంది. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీకి చెందిన సూకీ భవిష్యత్తు ఇప్పుడు మరింత నిరాశజనకంగా మారింది. 2020 స్వార్వత్రిక ఎన్నికల్లో సూకీ పార్టీ విజయం సాధించింది. అయితే 2021, ఫిబ్రవరి ఒకటో తేదీన సూకీ పార్టీ నుంచి అధికారాన్ని మిలిటరీ స్వాధీనం చేసుకుంది. ఎన్నికల సమయంలో విస్తృతస్థాయిలో మోసం జరిగినట్లు సూకీపై ఆరోపణలు వచ్చాయి. అయితే సూకీతో పనిచేసిన మాజీ సీనియర్ సభ్యుల్ని ఈ కేసులో మిలిటరీ అరెస్టు చేసింది.

తీస్తా సెతల్వాద్‌కు మధ్యంతర బెయిల్

న్యూదిల్లీ:
2002 గుజరాత్ అల్లర్ల కేసులో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు సుప్రీం కోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. గుజరాత్ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు సెతల్వాద్ పాస్‌పోర్టును కింది కోర్టుకు అప్పగించాలని, దర్యాప్తునకు సహకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ సుధాన్షు ధులియాతో కూడిన ధర్మాసనం సెతల్వాద్‌ను కోరింది. 'అప్పీలుదారు, ఒక మహిళ జూన్ 25 నుండి కస్టడీలో ఉంది. ఆమెపై ఆరోపణలు చేసిన నేరాలు 2002 సంవత్సరానికి సంబంధించినవి, ధ్రువీకరణల ప్రకారం జరుగుతున్నాయి. ఉత్తమంగా సంబంధిత పత్రాల తేదీ 2012. దర్యాప్తు యంత్రాంగం ఆమెను ఏడు రోజుల పాటు కస్టడీలో విచారించడం ద్వారా ప్రయోజనం పొందింది' అని

- మిగతా 2 లో

ఉత్తరాఖండ్‌లో పరువు హత్య

అగ్రవర్ణ యువతిని పెళ్లాడినందుకు దళితుడిని చంపేసిన ఘటన

దేశంలో కొన్నాళ్లుగా పరువు హత్యలు కొనసాగుతున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో ఉన్నత కులానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నందుకు దళిత వ్యక్తిని అతని అత్తమామలు హత్య చేశారు.

8లో

నిరుద్యోగం పైపైకి...

- ఏడాది గరిష్ఠానికి చేరిక
- ఆగస్టులో 8.3 శాతం నమోదు
- గత నెలలో ఉపాధి కోల్పోయిన 20 లక్షల మంది
- సీఎంఐఈ తాజా నివేదిక వెల్లడి

న్యూదిల్లీ:
దేశంలో నిరుద్యోగం అంతకంతకూ పెరుగుతున్నది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ఆర్థిక వినాశకర విధానాలు ప్రజల పొట్ట కొడుతున్నాయి. విద్యాధికులయిన యువత తీవ్ర నిరాశ చెందుతున్నారు. తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాలకులు వాస్తవాలను కప్పిపుచ్చుతూ అభివృద్ధి అంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. సీఎంఐఈ తాజా నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. దేశంలో ఆగస్టులో ఏడాది వ్యవధిలో గరిష్ఠంగా 8.3 శాతం నిరుద్యోగిత రేటు నమోదయింది. గత నెలలో 20 లక్షల మంది ఉపాధి కోల్పోయారని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) వెల్లడించింది. జులైలో 6.8 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు ఆగస్టులో 8.3 శాతానికి పెరిగిందని పేర్కొన్నది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 9.6 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా 7.7 శాతానికి (జులై 6.1 శాతం) చేరింది. బీజేపీ పాలిత హరియాణాలో నిరుద్యోగిత రేటు అధికంగా 37.3 శాతం ఉండగా, తరువాతి స్థానాల్లో కశ్మీర్ (32.8 శాతం), రాజస్థాన్ (31.4 శాతం) ఉన్నాయి. దేశంలో అస్థిర వర్షపాతం సాగు కార్యకలాపాలపై ప్రభావం చూపిందని, తద్వారా నిరుద్యోగం పెరిగిందని సీఎంఐఈ ఎండీ మహేశ్ వ్యాస్ పేర్కొన్నారు. ఇదిలాఉండగా, నిరుద్యోగ అంశంపై బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ సొంత పార్టీ ప్రభుత్వంపై మరోసారి విమర్శలు చేశారు. సీఎంఐఈ తాజా నివేదికను ప్రస్తావిస్తూ... యువకుల్లో ఉద్యోగిత రేటు ఐదేళ్ల కనిష్ఠానికి చేరిందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 2017లో 20.9 శాతంగా ఉన్న ఉద్యోగిత రేటు ప్రస్తుతం 10.4 శాతానికి పడిపోయిందని అన్నారు. ఉద్యోగాల కోసం దేశ యువత ఎన్నేళ్లు వేచిచూడాలని ప్రశ్నించారు. 10 లక్షల ఖాళీల భర్తీ చేపట్టాలని ప్రధాని మోదీ ఇటీవల ప్రభుత్వ శాఖను కోరారని, అయితే ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్విట్ జగన్.. సేవ్ ఏపీ

- ఇదే మన ఎన్నికల నినాదం
- హామీల అమలు కాదు..రాష్ట్రం లూటీ
- మౌలిక రంగాల విధ్వంసం
- ఎన్నికలకు సమాయత్తం కావాలి
- టీడీపీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
జగన్ రెడ్డి అరాచక పాలనపై పోరాడుతూ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నేతలు పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. మూడేళ్లలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని కాపాడుకోవటానికి రానున్న ఎన్నికల్లో 'క్విట్ జగన్-సేవ్ ఏపీ' నినాదంతో ప్రజలను చైతన్యవంతులను చేయాలని, పక్కా కార్యాచరణతో ప్రభుత్వ విధానాలపై పోరుకు సిద్ధం కావాలని నేతలకు మార్గనిర్దేశం చేశారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. చంద్రబాబు మాట్లాడుతూ జగన్ రెడ్డి అవినీతి కోసం వ్యవస్థలను, మౌలిక రంగాలను నాశనం చేశారని విమర్శించారు. కమీషన్ల కోసం మద్యం డిస్టిలరీలను, హోల్ సేల్, రిటైల్ అమ్మకాలను జగన్ రెడ్డి తన ఆధీనంలో పెట్టుకుని మద్యాన్ని క్యాష్ అండ్ క్యారీ విధానంలో అమ్మకాలు చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతి రాజధానికి తమ ప్రభుత్వం మంచి గుర్తింపు తెస్తే జగన్ రెడ్డి దానిని సర్వ నాశనం చేశారని, అనంతపురానికి కియా పరిశ్రమ తీసుకొచ్చి రెండు లక్షల ఉన్న ఎకరం భూమిని రెండు కోట్లు పలికేలా చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టును తాము 72 శాతం పూర్తి చేస్తే వైసీపీ హయాంలో అంగుళం కూడా ముందుకు కదలలేదని నిందించారు. అన్నమయ్య నిర్వాసితులకు ఇళ్లు కట్టివ్వలేకపోయారని, కొట్టుకుపోయిన పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు పెట్టలేని అసమర్థుడు జగన్‌రెడ్డి అని, ఆయన ప్రాజెక్టులు పూర్తి చేస్తారా? అని చంద్రబాబు ప్రశ్నించారు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్‌వేను పూర్తి చేయలేదని, అమరావతి ఔటర్ రింగ్‌ను పోగొట్టారని విమర్శించారు. పరిశ్రమలను బెదిరించి ఇతర రాష్ట్రాలకు తరిమేశారన్నారు. లూలూ ప్రాజెక్టు ఏపీ నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిపోయిందన్నారు. భారతదేశ చరిత్రలో రాజధాని లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ ఉన్నా, జగన్‌కు కనీసం సిగ్గనిపించడం లేదని చంద్రబాబు మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక ఇచ్చి రియల్ ఎస్టేట్ రంగాన్ని అభివృద్ధి చేస్తే...వైసీపీ నేతలు ఇసుక మాఫియాగా తయారై కోట్లు

- మిగతా 2 లో

కేరళలో మోదీకి నో ఛాన్స్

నితీశ్ కుమార్

ప్రధాని కాబట్టీ ఎక్కడికైనా వెళతారు.. ఏమైనా మాట్లాడతారుగానీ కేరళ రాష్ట్ర రాజకీయాలు ఎవరికీ తెలియనవి కాదు.. అంటూ మోదీపై బీహార్ సీఎం నితీశ్ కుమార్ విమర్శలు గుప్పించారు.

8లో

జార్ఖండ్‌లో అదే ఉత్కంఠ

- దిల్లీకి గవర్నర్
- వ్యక్తిగత పర్యటనేనన్న రాజ్‌భవన్ వర్గాలు



రాంచి:
జార్ఖండ్‌లో రాజకీయ సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ రమేశ్ బియాస్ శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌పై అనర్హత విషయమై నిర్ణయం తీసుకోవాలని ఈసీ చేసిన సిఫారసు వార్తలపై స్పష్టత ఇవ్వాలని గురువారం అధికార యూపీఏ ఎమ్మెల్యేలు గవర్నర్‌ను కోరారు. ఆ మరునాడే గవర్నర్ రమేశ్ బియాస్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లడం మరింత అనుమానాలకు తావిస్తున్నది. త్వరలో సందేహాలన్నీ నివృత్తి చేస్తారని సమాచారం. ఇదిలా ఉంటే రాజ్‌భవన్ వర్గాలు మాత్రం వైద్య పరీక్షల కోసమే గవర్నర్ దిల్లీకి వెళ్లారని, ఇది ఆయన వ్యక్తిగత పర్యటన అని చెప్పాయి. లాభదాయకమైన కార్యాలయం వ్యవహారంలో సోరెన్‌ను అసెంబ్లీ నుంచి అనర్హుడిగా ప్రకటించాలని బీజేపీ అభ్యర్థనను అనుసరించి ఎన్నికల సంఘం (ఈసీ) ఆగస్టు 25న రాష్ట్ర గవర్నర్‌కు తన నిర్ణయాన్ని పంపడంతో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభానికి దారితీసింది. ఈసీ నిర్ణయం ఇంకా అధికారికంగా వెలువడనప్పటికీ, ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం సిఫారసు చేసిందని ప్రచారం జరుగుతోంది. యూపీఏ సభ్యులు బైస్ నిర్ణయాన్ని ప్రకటించడంలో 'ఉద్దేశపూర్వకంగా ఆలస్యం'

- మిగతా 2 లో

భారత నేవీలోకి ఐఎన్ఎస్ విక్రాంత్

- లాంఛనంగా ప్రారంభించిన ప్రధాని మోదీ
- అతిపెద్ద విమానవాహక నౌక జాతికి అంకితం

కొచ్చి:
భారత నావికా దళం అమ్ములపొదికి దేశీయంగా తయారు చేసిన ఐఎన్ఎస్ విక్రాంత్ చేరింది. ఈ విమాన వాహక నౌకను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ప్రారంభించారు. దీనిని జాతికి అంకితమిచ్చారు. ఐఎన్ఎస్ విక్రాంత్ చేరిక ద్వారా దేశీయంగా తయారుచేసుకున్న విమానవాహక నౌకలను కలిగివున్న అమెరికా, బ్రిటన్, రష్యా, చైనా, ఫ్రాన్స్ సరసన భారత్ నిలిచింది. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను మోహరించడం వల్ల హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వం పెరుగుతాయని

- మిగతా 2 లో

అద్దె మోజు !

(మొదటిపేజీ తరువాయి)
విలీనం చేశారు. అప్పటి నుంచి ఆర్టీసీ అంశాన్ని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకుంటోంది. ఆర్టీసీ విలీనానికి ముందు, విలీనమయ్యాక చూస్తే, ఈ మూడేళ్లల్లో ఎలాంటి మార్పులేదు. ఆర్టీసీ సిబ్బంది ప్రభుత్వంలోకి రావడం మినహా సంస్థ సమగ్రాభివృద్ధికి కృషి జరగలేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసిన పీఆర్సీ తరహాలో ఆర్టీసీ-పీఆర్టీ విభాగం ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదు.

సొంత బస్సుల కొనుగోలు లేదు

ఉన్న బస్సులను ఆర్టీసీ నవీకరిస్తుందేగానీ కొత్త బస్సుల కొనుగోలుపై దృష్టి పెట్టడం లేదు. కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా అద్దె బస్సులను ఆహ్వానించడంపై విమర్శలున్నాయి. అత్యధికంగా అద్దె బస్సుల ప్రవేశంతో ఉద్యోగాలు కుదించుకుపోయే ప్రమాదముంది. యువతకు ఆర్టీసీలో ఉద్యోగాలు ఎంతమేరకు ఉంటాయనేదీ ప్రశ్నార్థకంగా మారింది. పదేపదే అద్దె బస్సులు పెంచుకుంటూపోతే ఆర్టీసీకి ఇప్పటికే ఉన్న సొంత బస్సుల పరిస్థితి ఏమిటనేదీ అంతుచిక్కడం లేదు. ఆర్టీసీకి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 11,500 బస్సులు నడుస్తున్నాయి. ఇందులో ఇప్పటికే 2,500 అద్దె బస్సులున్నాయి. ఆ అద్దె బస్సుల్లో దాదాపు 1000 బస్సులు కాలం చెల్లినవి ఉన్నట్లు సమాచారం. మొత్తంగా (సొంత, అద్దె బస్సులు) 50శాతం బస్సులకు కాలం చెల్లింది. ఆ బస్సుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణించాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బస్సులు మరమ్మతులకు గురైనప్పుడు వాటికి అవసరమైన విడిభాగాలు, పరికరాలు అందుబాటులో లేవు. ఇటీవల కాలంలో అక్కడక్కడా బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి. సుదీర్ఘ అనుభవం, నిష్ణాతులైన డ్రైవర్లు ఆర్టీసీలో పనిచేస్తున్నందున ఘోర ప్రమాదాల్ని నివారిస్తున్నారు. సొంత బస్సుల నవీకరణకు యాజమాన్యం కొంత వరకు ప్రయత్నిస్తోంది. గతేడాది రూ.15 కోట్ల వ్యయంతో 1285 పల్లె వెలుగు బస్సులను నవీకరించింది. ఈ ఏడాది రూ.25 కోట్లతో 1100 ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, అల్ట్రా, డీలక్స్ బస్సులను ఆధునీకరించనుంది.

ప్రతి నెలా ప్రభుత్వానికి రూ.125 కోట్లు

ఆర్టీసీ ఆదాయం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతినెలా రూ.125కోట్లు జమ చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైనప్పటికీ బస్సుల కొనుగోలుకు ప్రయత్నించడం లేదు. ఆర్టీసీ సొంతంగా ఉన్నా, విలీనమైనా ఒక్కటేననే భావన ఉద్యోగుల్లో ఏర్పడింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆర్టీసీ సొంత బస్సులు పెంచుకోవాల్సి ఉంది. సొంత బస్సులతోనే ఆర్టీసీకి, సిబ్బందికి, ప్రయాణికులకు లాభం చేకూరుతుంది. ఎలక్ట్రిక్ బస్సులు, అద్దె బస్సులతో ప్రైవేట్ సిబ్బంది వస్తారేగానీ, కొత్తగా ఉద్యోగ కల్పన ఉండబోదు. నూతన ఉద్యోగాలు కుదించుకుపోయే ప్రమాదముంది. సొంత బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాల్సిన అవసరముంది. గొప్ప చరిత్రగల ఆర్టీసీ పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తీస్తా సెతల్వాద్‌కు మధ్యంతర బెయిల్

(మొదటిపేజీ తరువాయి)
సెతల్వాద్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ధర్మాసనం పేర్కొంది. కేసు సంఘటనల క్రమాన్ని ప్రస్తావిస్తూ, రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు జారీ చేస్తూ, ఆమెకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలనే అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఉండాల్సిందని ధర్మాసనం పేర్కొంది. 'సెతల్వాద్‌ను ఏడు రోజుల పాటు కస్టడీలో ఉంచినందున కస్టడీ విచారణ పూర్తయిన అంశం. మధ్యంతర బెయిల్ విషయం వినవలసి ఉంది' అని తెలిపింది. సెతల్వాద్ ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీలో ఉంచారు. ఈ అంశాన్ని హైకోర్టు సీజ్ చేసినందున రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొంటూ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. గుజరాత్ హైకోర్టు సెతల్వాద్ బెయిల్ పిటిషన్‌ను అలస్యంగా జాబితా చేయడానికి గల కారణాన్ని గురువారం అత్యున్నత న్యాయస్థానం తెలుసుకోవాలని కోరింది. 2002 గుజరాత్ అల్లర్ల కేసుల్లో అమాయకులను ఇరికించేందుకు కల్పిత సాక్ష్యాలను రూపొందించారని తీస్తా సెతల్వాద్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సెతల్వాద్‌ను జూన్ 25న అరెస్టు చేశారు. తనకు బెయిల్ నిరాకరించిన సెషన్స్, హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ఆమె సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు, సెతల్వాద్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ, ఆమె పై దాఖలయిన ఎఫ్ఐఆర్ జూన్ 24న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ముగిసిన ప్రక్రియను పునశ్చరణ చేయడం తప్ప మరొకటి కాదని వాదించారు. సెతల్వాద్ రెండు నెలలకు పైగా కస్టడీలో ఉన్నారని, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వాస్తవిక దరఖాస్తు పెండింగ్‌లో ఉన్న సమయంలో మధ్యంతర బెయిల్‌కు అర్హురాలని సిబల్ చెప్పారు. గుజరాత్ ప్రభుత్వం తరపున హాజరయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా... ఎఫ్ఐఆర్‌లో తీస్తా సెతల్వాద్ ప్రమేయాన్ని సూచిస్తూ ప్రచారం చేసిన అంశాలే కాకుండా తగినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని కోర్టుకు సమర్పించారు. తీస్తా సెతల్వాద్ దరఖాస్తు ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉందని తుషార్ మెహతా వాదించారు. కాబట్టి ఈ అంశాన్ని హైకోర్టు పరిశీలించేందుకు అనుమతించాలని కోరారు. రెండు పక్షాల వాదనలను విన్న సుప్రీం ధర్మాసనం ఆమెకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తుది బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని గుజరాత్ హైకోర్టును కోరింది. అయితే శనివారంలోగా ఆమెను విడుదల చేయాలని సుప్రీం కోర్టు పేర్కొంది. జులై 30న అహ్మదాబాద్‌లోని సెషన్స్ కోర్టు ఈ కేసులో సెతల్వాద్, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఆర్.బి.శ్రీకుమార్ బెయిల్ దరఖాస్తులను తిరస్కరించింది. వారిని విడుదల చేస్తే, ఒక వ్యక్తి శిక్షార్హత లేకుండా ఆరోపణలు చేసి తప్పించుకోవచ్చని అది తప్పు చేసిన వారికి సందేశాన్ని పంపుతుందని న్యాయస్థానం పేర్కొంది. జూన్‌లో అరెస్టయిన సెతల్వాద్, మాజీ డీజీపీ ఆర్‌బీ శ్రీకుమార్... గోధ్రా అనంతర అల్లర్ల కేసుల్లో 'అమాయకులను' ఇరికించేందుకు కల్పిత సాక్ష్యాలను సృష్టించారని ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. కాగా వారిని సబర్మతి సెంట్రల్ జైలులో ఉంచారు. శ్రీకుమార్ కూడా బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినట్లు వార్తా సంస్థ పీటీఐ నివేదించింది. ఈ కేసులో మూడో నిందితుడైన మాజీ ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఈ కేసులో అరెస్టయ్యాక భట్ అప్పటికే మరో నేరపూరిత కేసులో జైలులో ఉన్నాడు. జకియా జాఫ్రీ దాఖలు చేసిన పిటిషన్‌ను జూన్ 24న సుప్రీం కోర్టు కొట్టివేసిన తర్వాత ముంబైకి చెందిన సెతల్వాద్, శ్రీకుమార్‌లను రెండు రోజుల్లో అరెస్టు చేశారు.

క్విట్ జగన్..సేవ్ ఏపీ

(మొదటిపేజీ తరువాయి)
దండుకుంటున్నారని ఆరోపించారు. తాము తీసుకొచ్చిన సోలార్, విండ్ ప్రాజెక్టులకు జగన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేస్తున్నారని, టీడీపీ ప్రారంభించిన కడప స్టీల్ ప్లాంట్‌కు తిరిగి శంకుస్థాపన చేశారని, మూడున్నరేళ్లలో ఒక్క యూనిట్ అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయలేని అసమర్థుడు జగన్ రెడ్డి అని విమర్శించారు.

95 శాతం హామీలు నెరవేర్చామని చెపుతున్న జగన్ రెడ్డి...95 శాతం రాష్ట్రాన్ని లూటీ చేశారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. టీడీపీ మళ్లీ అధికారం లోకి వచ్చి ఉంటే పెన్షన్ మూడు వేలు ఇచ్చే వాళ్లమన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేశారు....ఇప్పుడు అన్నం పెడుతుంటే దాడులు చేస్తున్నారు. విదేశీ విద్య వంటి పథకాలకు కోతలు పెడుతున్నారు. విలీనం పేరుతో పాఠశాలలు మూసివే స్తున్నారు. సంపద సృష్టించి సంక్షేమం చేసిన పార్టీ టీడీపీ. ఆర్థిక అసమానతలు తగ్గించడం టీడీపీ సిద్ధాంతమని చంద్రబాబు స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఎలా దివాలా తీసిందో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచిం చారు. మాటలు ఎంత ముఖ్యమో చేతలు అంతే ముఖ్యమని హితబోధ చేశారు. ఇక్కడ మాటలు చెప్పి బయటకు వెళ్లి పని చెయ్యకుండా ఉంటే కుదరదని చంద్రబాబు హెచ్చరించారు. ఎన్నికలకు ఎక్కువ సమయం లేదని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నేతలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రులు ప్రసంగించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు.

అర్జెంటీనా ఉపాధ్యక్షురాలిపై హత్యాయత్నం

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా ఉపాధ్యక్షురాలు క్రిస్టినా ఫెర్నాండేజ్ డీ కిర్చినర్‌పై హత్యాయత్నం జరిగింది. బ్యూనస్ ఎయిర్స్‌లోని ఆమె నివాసం వద్ద ఓ ఆగంతకుడు తన వద్ద ఉన్న పిస్తోల్‌తో అమె నుదుటిపై ఎక్కుపెట్టి కాల్చేందుకు యత్నించాడు. అయితే ట్రిగ్గర్ నొక్కినా.. ఆ గన్ పేలకపోవడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది ఆమెను వెంటనే రక్షించారు. ట్రిగ్గర్ నొక్కినా.. గన్ పేలలేదని, క్రిస్టినా ప్రాణాలతోనే ఉన్నట్లు ఆ దేశాధ్యక్షుడు అల్బర్టో ఫెర్నాండేజ్ తెలిపారు. ఆమె ఇంటి వద్ద వేలాది మంది మద్దతుదారులను పలకరిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆగంతకుడు కేవలం కొన్ని ఇంచుల దూరం నుంచే పిస్తోల్‌ను పేల్చినట్లు వీడియో ఫూటేజ్ ద్వారా తెలుస్తోంది. కాల్పులకు దిగిన వ్యక్తిని 35 ఏళ్ల బ్రెజిల్ వ్యక్తిగా గుర్తించారు. అతన్ని వెంటనే అరెస్టు చేశారు. గన్‌ను సీజ్ చేశారు. ఫెర్నాండజ్‌పై నమోదైన అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతోంది. ఇందులో భాగంగా కోర్టుకు హాజరైన ఫెర్నాండజ్ సాయంత్రం తన నివాసానికి చేరుకున్నారు. తన మద్దతుదారులను పలకరించుకుంటూ లోనికి వెళ్లే సమయాన ఈ ఘటన జరిగింది. ఫెర్నాండజ్‌పై హత్యాయత్నాన్ని అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాండజ్ ఖండించారు. ఆమెకు సంఘీభావంగా శుక్రవారం సెలవు ప్రకటించారు.



చైనా జాతీయ రక్షణ విద్యా మార్గదర్శకాల విడుదల



బీజింగ్: ప్రజలందరికీ జాతీయ రక్షణ విద్యను మెరుగుపరచడంపై మార్గదర్శకాన్ని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) విడుదల చేసింది. జాతీయ రక్షణ విద్య ప్రాముఖ్యతను, జాతీయ రక్షణపై ప్రజలకు పెరుగుతున్న అవగాహనను పేర్కొంటూ, ఈ మార్గదర్శకాలు జాతీయ భద్రతకు సమగ్ర విధానాన్ని అమలు చేయడానికి తదుపరి ప్రయత్నాలను నిర్దేశిస్తుంది, శాంతి సమయాల్లో ప్రజల అప్రమత్తతను మెరుగుపరచడం, సైనిక సిబ్బంది పట్ల గౌరవం, బాధ్యత భావం, బలమైన సైన్యంతో బలమైన దేశాన్ని నిర్మించడం లక్ష్యంగా సీపీసీ పేర్కొంది. దేశ రక్షణను కాపాడే లక్ష్యంగా కార్యాచరణను మొత్తం సమాజం పంచుకోవాలని ఈ మార్గదర్శకం పేర్కొంది. జాతీయ రక్షణ సిద్ధాంతాలు, చరిత్ర, శాసనాలు, సంబంధితాలు, పనులు, నైపుణ్య శిక్షణ, సంస్కృతిలో మెరుగైన విద్యను మార్గదర్శకం నిర్దేశించింది. ఇది పార్టీ, ప్రభుత్వ అధికారులతో పాటు సాధారణ ప్రజలకు జాతీయ రక్షణ విద్యను పెంపొందించే ప్రయత్నాలను వివరిస్తుంది. ముఖ్యంగా యువతలో అవగాహన పెంచడానికి జాతీయ రక్షణ విద్యను పాఠశాల పాఠ్యాంశాలలో చేర్చాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ప్రజల కోసం మరిన్ని జాతీయ రక్షణ విద్యా స్థావరాలను నిర్మించడానికి, జాతీయ రక్షణ నేపథ్య చలనచిత్ర ప్రదర్శనలు, క్రీడా కార్యక్రమాల వంటి వాటిపై మరింత అవగాహన పెంచే కార్యక్రమాలను ప్రారంభించేందుకు కూడా ఈ మార్గదర్శకం పిలుపునిచ్చింది. జాతీయ రక్షణ విద్యను ప్రోత్సహించడానికి బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి డిజిటల్ టెక్నాలజీలను ఉపయోగించాలని మార్గదర్శకం పేర్కొంది.

భారత నేవీలోకి 'ఐఎన్ఎస్ విక్రాంత్'

(మొదటిపేజీ తరువాయి)
భారత నౌకాదళ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు భారత్ నిర్మించిన అతిపెద్ద విమాన వాహక నౌక కూడా ఇదే కావడం విశేషం. ఈ నౌక నిర్మాణానికి సుమారు రూ.20,000 కోట్లు ఖర్చుచేశారు. భారత నౌకా దళానికి సరికొత్త గుర్తు (నిషాన్)ను కూడా ఆవిష్కరించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ఆటోమేషన్ సౌకర్యాలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌లో అత్యధిక శాతం దేశీయంగా తయారైన పరికరాలనే వినియోగించారు. ఇందుకోసం అనేక భారీ పరిశ్రమలు, 100 ఎంఎస్ఎంఈలు పనిచేశాయి. ఐఎన్ఎస్ విక్రాంత్ రాకతో రెండో ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ భారత్‌కు అందుబాటులోకి వచ్చినట్లైంది. నేవీకి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో విక్రాంత్ నమూనాను రూపొందించగా కొచ్చిన్ షిప్‌యార్డ్ నౌక నిర్మాణాన్ని పూర్తిచేసింది. నౌక నిర్మాణం కోసం ప్రత్యేక ఉక్కును ప్రభుత్వరంగ సంస్థ సెయిల్, డీఆర్‌డీవోలు సమష్టిగా అభివృద్ధి చేశాయి. 262 మీటర్ల పొడవు, 62 మీటర్ల వెడల్పుగల ఐఎన్ఎస్ విక్రాంత్ బరువు 43,000 టన్నులు. ఇది గంటకు 28 నాట్స్ వేగంతో ఏకధాటిగా 7,500 నాటికల్ మైళ్లు ప్రయాణించగలదు. 18 అంతస్తుల ఎత్తులో రెండు ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో ఉండే ఈ నౌకలో మొత్తం 2,400 కంపార్టుమెంట్లు నిర్మించారు. మొత్తం 1,600 మంది సిబ్బంది సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించారు. మహిళా అధికారుల కోసం ప్రత్యేక క్యాబిన్లు ఉన్నాయి. పూర్తి స్థాయి మెడికల్ కాంప్లెక్స్ ఉంది. 16 పడకల ఆసుపత్రిలో ఫిజియోథెరపీ, ఐసీయూ, ల్యాబ్‌లున్నాయి. గంటకు 3,000 చపాతీలు తయారు చేయగల యంత్రాలతో పాటు 250 ఫ్యూయల్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి 30 యుద్ధవిమానాలను సౌకర్యవంతంగా నిర్వహించవచ్చు. మిగ్-29కే ఫైటర్ జెట్‌లు, కమావ్-31, హెచ్ఆర్-60ఆర్ హెలికాప్టర్లు అందుబాటులో ఉంటాయి. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను ప్రారంభించిన తర్వాత ప్రధాని మోదీ ప్రసంగించారు. 'ఇటువంటి భారీ విమాన వాహక నౌకలను తయారు చేయగల ప్రపంచ దేశాల సరసన భారత్ నిలిచింది. ఐఎన్ఎస్ విక్రాంత్ దేశంలో నూతన విశ్వాసాన్ని నింపింది. భారతీయ నైపుణ్యత, సామర్థ్యానికి సాక్షిగా నిలిచింది' అని అన్నారు. ఇదే సందర్భంగా నవల్ ఎన్‌సైన్ (నిషాన్) (గుర్తు)ను ప్రధాని ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ఇది రూపొందింది. 'సెప్టెంబరు 2, 2022 చరిత్రాత్మకమైన రోజు. బానిసత్వ సంకెళ్లను భారత్ తెంచుకుంది. భారతీయ నేవీకి కొత్త జెండా లభించింది. ఇప్పటివరకు నేవీ జెండాలో బానిసత్వ గుర్తింపు కనిపించింది కానీ నేటి నుంచి ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో కొత్త జెండా సముద్రంలో, ఆకాశంలో ఎగురబోతోంది' అని ప్రధాని అన్నారు. యుద్ధనౌకల చరిత్రలో ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రారంభోత్సవం చరిత్రాత్మకమని నేవీ పేర్కొంది. దేశాన్ని స్వీయసమృద్ధి చేయాలన్న కేంద్రప్రభుత్వ సంకల్పానికి ఐఎన్ఎస్ విక్రాంత్ చోదకశక్తినిచ్చిందని మోదీ అంతకుముందు అన్నారు. ఈ నౌకలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో ఐదువేల ఇళ్లను కాంతివంతం చేయొచ్చు అని చెప్పారు. కేరళ తీరం నుంచి ప్రతి భారతీయుడు కొత్త భవిష్యత్ సూర్యోదయాన్ని చూస్తున్నారంటూ మోదీ వ్యాఖ్యానించారు. నవతరం ఆశలు, ఆకాంక్షలకు ఐఎస్ఎస్ విక్రాంత్ ఊతమిస్తుందని, స్వాతంత్ర సమరుల కలలను సాకారం చేస్తుందని, దేశాన్ని శక్తిమంతం చేస్తున్నదని ఆయనన్నారు. విక్రాంత్ చాలా పెద్దది.. విశాలమైనది.. భిన్నమైనది.. ప్రత్యేకమైనది.. ఇది యుద్ధ నౌక మాత్రమే కాదు. 21వ శతాబ్దపు భారతీయ సామర్థ్యానికి, నిబద్ధత, నైపుణ్యత, శ్రమకు ప్రత్యక్ష సాక్షి అని అని మోదీ అభివర్ణించారు. నేటి భారతానికి ఏ సవాల్ కూడా కష్టం కాబోదన్నారు. కొచ్చిన్ షిప్‌యార్డు ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, నేవీని... ప్రత్యేకించి ఈ ప్రాజెక్టు వర్కర్లను మోదీ ప్రశంసించారు. ఓనం సందర్భంగా ఈ కార్యక్రమం జరగడంతో ఆనందం రెట్టింపు అయిందని చెప్పారు. ఐఎస్ఎస్ విక్రాంత్‌లోని ప్రతి అణువు ప్రత్యేకమైనదిగా చెప్పారు. సముద్ర శక్తికి మహిళా శక్తి తోడు కాబోతోందని ఐఎన్ఎస్ విక్రాంత్‌లో మహిళా అధికారులనుద్దేశించి మోదీ అన్నారు. ఈ కార్యక్రమానికి రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్ హరి కుమార్, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్రమంత్రులు సర్బానంద సోనోవాల్, అజయ్ భట్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితరులు హాజరయ్యారు.

జార్ఖండ్‌లో అదే ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)
చేయడం ద్వారా రాజకీయ ప్రలోభాలను ప్రోత్సహిస్తున్నారని ఆగస్టు 28న సంయుక్త ప్రకటనలో ఆరోపించారు. సోరెన్ పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) మహారాష్ట్ర తరహాలో ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నంలో పార్టీ నుంచి, అలాగే మిత్రపక్షం కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలకు ఎర వేసేందుకు తీవ్రమైన ప్రయత్నం చేస్తోందని అభిప్రాయపడింది. శాసనసభ్యులను సురక్షిత ప్రాంతానికి చేర్చేందుకు, అధికార కూటమికి చెందిన 32 మంది ఎమ్మెల్యేలను ఆగస్టు 30న కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లోని ఒక రిసార్ట్‌కు తరలించారు. అయితే వారిలో నలుగురు గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో పాల్గొనడానికి తిరిగి వచ్చారు. కాగా 5వ తేదీన జార్ఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 81 మంది సభ్యుల శాసనసభలో అధికార జేఎంఎం-కాంగ్రెస్-ఆర్‌జేడీ సంకీర్ణానికి పూర్తి మెజారిటీ ఉన్నందున, సీఎంను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం ఉండదని యూపీఏ నొక్కి చెప్పింది. అతిపెద్ద పార్టీ అయిన జేఎంఎంకు 30 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 18 మంది ఎమ్మెల్యేలు, ఆర్జేడీకి ఒకరు ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షం బీజేపీకి సభలో 26 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

తెలంగాణపై ఎందుకీ వివక్ష

బల్క్ డ్రగ్ పార్క్ ఎందుకు కేటాయించలేదు

కుత్సిత రాజకీయాలేంటి?

కేంద్రమంత్రి మాండవీయకు కేటీఆర్ లేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణపై మోదీ సర్కార్ వివక్షత కొనసాగుతోందని ఐటీశాఖమంత్రి కె.తారకరామారావు విమర్శించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బల్క్ డ్రగ్ పార్క్ పథకంలో తెలంగాణకు చోటు దక్కకపోవడమే ఇందుకు సాక్ష్యమని పేర్కొన్నారు. ఫార్మా రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలను ఎంపిక చేయడం మోదీ సర్కార్ వివక్ష రాజకీయాలకు పరాకాష్ట అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్ ఫార్మాసిటీ పేరును కనీసం పరిశీలించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. బల్క్ డ్రగ్ పార్కు కేటాయింపులో తెలంగాణకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని ఎత్తిచూపుతూ కేంద్ర ఎరువులు, రసాయనశాఖ మంత్రి మన్సుక్ మాండవీయకి కేటీఆర్ శుక్రవారం లేఖ రాశారు. మారుతున్న ప్రపంచ రాజకీయాల దృష్ట్యా బల్క్ డ్రగ్ తయారీలో దేశీయ ఫార్మా రంగం స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యంతో 2015లో రెండు వేల ఎకరాల్లో వివిధ రాయితీలు, ప్రోత్సాహకాలతో బల్క్ డ్రగ్ పార్క్ పథకాన్ని కేంద్రం తెరపైకి తీసుకువచ్చిందని గుర్తుచేశారు. అయినా దీనిపై మోదీ సర్కారు ఇంతకాలం నిర్లక్ష్యం వహించిందని, అమలులో తీవ్ర జాప్యం చేసిందని విమర్శించారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం సుదీర్ఘకాలంగా కేంద్రాన్ని కోరుతున్నామని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపామన్నారు. హైదరాబాద్ ఫార్మాసిటీలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్రానికి స్పష్టంగా తెలియచేశామన్నారు. కీలకమైన భూసేకరణ, పర్యావరణ అనుమతులతో పాటు ఫార్మాసిటీకి ఉన్న సానుకూల అంశాలను వివరిస్తూ కేంద్రానికి సమగ్ర నివేదిక ఇచ్చామని తెలిపారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి కేంద్రమంత్రులను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి తాజాగా ప్రకటించిన జాబితాలో తెలంగాణకు చోటు దక్కకపోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. మోదీ సర్కార్ నిర్వాకంతో దిగుమతుల కోసం విదేశాలపై ఆధారపడుతున్న ఫార్మా పరిశ్రమకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. దేశీయ ఫార్మా రంగాన్ని స్వయం సమృద్ధిగా మార్చాలన్న లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటే తెలంగాణలో వెంటనే బల్క్ డ్రగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టొద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

బ్రిటన్ ప్రధాని రేసులో ట్రస్ ముందంజ

లండన్: దేశవ్యాప్త పర్యటనలు, టెలివిజన్ చర్చలు తర్వాత బ్రిటన్ ప్రధానిగా లిజ్ ట్రస్ బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. శుక్రవారం కన్సర్వేటివ్ సభ్యులు ఓటింగ్ ముగియనుంది. ఫలితాలు సోమవారం ప్రకటిస్తారు. రిషి సునక్, లిజ్ ట్రస్‌ల మధ్య మెరుగైన అభ్యర్థిని తేల్చడానికి 1.75 లక్షల మంది కన్సర్వేటివ్ సభ్యులు ఓటింగ్ ప్రక్రియలో శుక్రవారం పాల్గొంటారు. బుధవారం రాత్రి వెంబ్లే వేదికగా బ్రిటన్ ప్రధాని ఎన్నికల సమరం తుది అంకానికి చేరింది. జాన్సన్ రాజీనామాతో 200,000 మంది సభ్యులచే పోస్టల్, ఆన్‌లైన్ ఓటింగ్ ఆగస్టులో ప్రారంభమైంది. జాన్సన్ తన రాజీనామాను బ్రిటన్ క్వీన్‌కు సమర్పించకముందే ఈ ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. దీనిలో లిజ్ ట్రస్ మెజారిటీ ఓట్లు సంపాదించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి, విజేతలు బ్రిటన్ రాణి అనుమతితో ప్రధాని పదవి చేపట్టనున్నారు. కొత్తగా ప్రధాని పదవికి ఎన్నికైన బ్రిటన్ కు వివిధ సమస్యలు వెంటాడుతున్నాయి. దేశంలో ద్రవ్యోల్బణం నమోదుకావడంతో ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయి. దీనికితోడు రష్యా యుద్ధ ప్రభావంతో చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. తాను అధికారం చేపడితే పన్నులు గణనీయంగా తగ్గిస్తానని ట్రస్ హామీ ఇచ్చారు.

అఫ్గాన్ మసీదులో పేలుడు: మత గురువు మృతి

కాబూల్ : అఫ్గానిస్థాన్‌లోని హెరత్ గుజర్గా మసీదులో శుక్రవారం జరిగిన పేలుడులో ప్రముఖ మత గురువు ముజిబురుల్ రెహ్మాన్ అన్సారీ మరణించారు. ఈ పేలుడులో 20 మంది మరణించగా 200 మంది గాయపడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల సమయంలో ఈ పేలుడు జరిగినట్టు సమాచారం. అఫ్గాన్‌లో విదేశీ సేనల ఉపసంహరణతో 2021లో అఫ్గాన్‌ను స్వాధీనం చేసుకున్న తాలిబన్లకు అన్సారీ అత్యంత సన్నిహితుడు. అన్సారీ మృతిని తాలిబన్ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ధ్రువీకరించారు. కాగా ఈ పేలుడుకు తామే బాధ్యులమంటూ ఇప్పటివరకూ ఏ సంస్థ, వ్యక్తులు ప్రకటించలేదు.

మోదీ... ఎంత అబద్ధం!

(మొదటిపేజీ తరువాయి)
వెళ్లడం, ఆపై విడుదల గురించి వివరాలు తమ వద్ద లేవని వెల్లడించింది. గతేడాది బంగ్లదేశ్ వెళ్లిన మోదీ బంగ్లాదేశ్ జాతీయ స్మారక చిహ్నం (జాతియో షోహిద్ స్మృతి శౌధో), ఢాకాకు వాయువ్యంగా 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న సవార్‌లోని జాతీయ అమరవీరుల స్మారకాన్ని (జాతియో షోహిద్ స్మృతి శౌధో) సందర్శించి, 1971 బంగ్లాదేశ్ యుద్ధ అమరులకు నివాళులర్పించారు.

2021 మార్చి 27న ది వైర్‌లో ఓ వ్యాసం ప్రచురితమైంది. 1971 ఆగస్టు 1-11 వరకు ఢిల్లీలో 'బంగ్లాదేశ్‌ను గుర్తింపునకు సత్యాగ్రహం' ఉద్యమాన్ని జన్ సంఘ్ చేపట్టిందని శుద్ధబ్రత సేన్‌గుప్తా పేర్కొన్నారు. 1971 ఆగస్టు 9న జరిగిన భారత్-యూఎస్ఎస్ఆర్ మైత్రి ఒప్పందానికి వ్యతిరేకంగా ర్యాలీగా ఇది పరిణమించినట్లు తెలిపారు. ఈ ఒప్పందం బంగ్లదేశ్‌ను దృష్టిలో పెట్టుకొని జరిగింది. దీంతో సన్నద్ధత లేక యుద్ధం చేయాలన్న ప్రాథమిక ఉద్దేశం కనిపించింది. ఈ ఒప్పందం ద్వారా బంగ్లదేశ్‌ను మోసం చేశారని జన్‌సంఘ్ నిరూపించాలనుకుంది. 1971, ఆగస్టు 12న ఢిల్లీలో జరిగిన భారీ ర్యాలీని ఉద్దేశించి వాజ్‌పేయి మాట్లాడారని, ఇండో-సోవియట్ ఒప్పందాన్ని బంగ్లాదేశ్ గుర్తింపును నిరాకరించే ఢిల్లీకి మాస్కోకు మధ్య జరిగిన కుట్రగా అభివర్ణించారని సేన్‌గుప్తా... టైమ్స్ ఆఫ్ ఇండియాలో పేర్కొన్నారు. 'నరేంద్ర మోదీ తాను పాల్గొన్నట్లు చెబుతున్న సత్యాగ్రహం ఇదే. బంగ్లాదేశ్‌కు వెళ్లినప్పుడు ఆయన దీనిని ప్రస్తావించారు. బంగ్లాదేశ్‌లో అత్యున్నత పౌర పురస్కారాన్ని అటల్ బిహారీ వాజ్‌పేయి తరపున అందుకున్నప్పుడూ ఈ సత్యాగ్రహం గురించి మాట్లాడారు అని సేన్‌గుప్తా రాశారు. మోదీ స్వీయచరిత్రలో రచయిత మాటలోనూ దీని గురించి ప్రస్తావన ఉంది.

1978లో ప్రచురితమైన సంఘర్ష్ మా గుజరాత్ అనే పుస్తకంలో మోదీ దీని గురించి రాశారని చెబుతున్నారని సేన్‌గుప్తా తెలిపారు. ఈ పుస్తకం 2000 ఎడిషన్‌ను చదివిన గుజరాతీలు మాత్రం 'బంగ్లాదేశ్ సత్యాగ్రహంలో పాల్గొనడం వల్ల తీహార్ జైలులో జైలు శిక్ష అనుభవించినట్లు రచయిత గురించి పుస్తకం వెనుక ప్రచురించిన దాంట్లో ఉన్నాగానీ లోపల ఎక్కడ ప్రస్తావన రాలేదని చెప్పారు. మోదీ మాటలపై దుమారం క్రమంలో దీనిపై వివరాలను సేకరించేందుకు ఆర్టీఐ అర్జీని జయేశ్ గుర్నానీ 2021, మార్చి 27న దాఖలు చేశారు. మోదీ అరెస్టు, జైలు, విడుదల, ఆయనపై ఎఫ్ఐఆర్ వంటి వివరాలను పీఎంఓ వద్ద నుంచి ఆయన కోరారు. దీనిపై పీఎంఓ వద్ద సమాధానం లేదు. తమ వద్ద ఆ రికార్డులు లేవని బదలిచ్చింది. 2014లో మోదీ ప్రధాని అయినప్పటి నుంచి ఆయన రికార్డులను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పీఎంఓ సమాధానంతో అసంతృప్తి చెందిన జయేశ్... ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ (ఎఫ్ఏఏ) / పీఎంఓ డైరెక్టర్‌కు మొదటి అప్పీలు పంపారు. 2021, జూన్ 15న ఎఫ్ఏఏ స్పందించింది. దరఖాస్తులో మీకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని అన్నారుగానీ సీపీఐఓ నుంచి 2021 జూన్ 4న మీకు ఆన్‌లైన్ ద్వారా స్పందన లభించింది అని పేర్కొంది. సమాధానం లభించింది కాబట్టి తదుపరి చర్యలు ఉండవని చెప్పి కొట్టేసింది. దాంతో జిగ్నేశ్.. సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. 2022, ఆగస్టు 18న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ వ్యవహారాన్ని కమిషన్ విచారించింది. 30 రోజుల్లోగా సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదు తమకు అప్పీలు చేసినట్లు పేర్కొంది. సీపీఐఓ, పీఎంఓ డిప్యూటీ కార్యదర్శి (ఆర్టీఐ) దీనిపై స్పందిస్తూ కోవిడ్ వల్ల జాప్యం జరిగినట్లు వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా ఈ తప్పుడు ఉద్దేశంతో సమాచారం నిరాకరించలేదు అన్నది చూడటానికి కమిషన్ బాధ్యత అని, ఈ వ్యవహారంలో అలాంటిదేమీ జరగలేదంటూ కేసును సీఐసీ సిన్హా కొట్టివేశారు.



వైఎస్‌కు కాంగ్రెస్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు సాకే శైలజానాథ్ పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరుకు ట్యాబ్‌లు ఇవ్వాలి: ఫోర్టో

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరుకు సంబంధించి ట్యాబ్‌లు/లేదా బయోమెట్రిక్ డివైజ్‌లను పంపిణీ చేయాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ సామల సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం టీచర్ల హాజరు కోసం అమలు చేసే ముఖ గుర్తింపు హాజరులో తమకు అభ్యంతరం లేదని, అందుకు సంబంధించిన పరికరాలను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు.

సంపాదకీయం

సుప్రీంకోర్టు చేసిన న్యాయం

అత్యున్నత న్యాయస్థానం వ్యవహార సరళి మూసపోసినట్టు ఎప్పుడూ ఒకే విధంగా ఉండకపోవచ్చు. న్యాయమూర్తుల దృక్పథం దీనికి కారణం అయి ఉండొచ్చు. హక్కుల కార్యకర్త, న్యాయవాది తీస్తా సెతల్వాద్ కేసులో సరిగ్గా ఇలాగే జరిగింది. 2002లో గుజరాత్ మారణకాండ సమయంలో కిరాతకంగా హత్యకు గురైన ఎహసాన్ జాఫ్రీ భార్య జకియా జాఫ్రీ ఈ కేసులో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా విచారించాలని చాలాకాలంగా న్యాయ పోరాటం చేస్తున్నారు. జకియా జాఫ్రీకి ఈ కేసులో తీస్తా సెతల్వాద్ మొదటి నుంచీ దన్నుగా నిలిచారు. జకియా అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. పైగా తీస్తా సెతల్వాద్ లాంటి వారి మీద న్యాయమూర్తులు ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. సెతల్వాద్ లాంటి వారు జకియా జాఫ్రీ కేసును సంవత్సరాల తరబడి సాగదీస్తూ న్యాయ ప్రక్రియకే విఘాతం కలిగిస్తున్నారని వీరి మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వ్యాఖ్యానించారు. అంతే ఈ వ్యాఖ్యల ఆధారంగా గుజరాత్ పోలీసులు తీస్తా సెతల్వాద్, మాజీ పోలీసు అధికారులు ఆర్.బి.శ్రీకుమార్, సంజీవ్ భట్ మీద హడావుడిగా కేసులు మోపారు. సంజీవ్ భట్ ఇదివరకే జైలులో ఉన్నారు. సెతల్వాద్‌ను, శ్రీ కుమార్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించారు. సెతల్వాద్ గుజరాత్ హైకోర్టులో బెయిలు కోసం దరఖాస్తు పెట్టుకుంటే ఫలితం లేనందువల్ల ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్, న్యాయమూర్తులు ఎస్. రవీంద్ర భట్, సుధాంశు ధులీతో కూడిన బెంచి శుక్రవారం సెతల్వాద్‌కు తాత్కాలిక బెయిలు మంజూరు చేసింది. అయితే దర్యాప్తులో సహకరించాలని, తన పాస్‌పోర్టు గుజరాత్ హైకోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. అలాగే సెతల్వాద్‌కు పూర్తి స్థాయి బెయిలు మంజూరు చేసే విషయంలో హైకోర్టుదే తుది నిర్ణయం అని కూడా స్పష్టం చేసింది. అదే సుప్రీంకోర్టులోని మరో బెంచి చేసిన వ్యాఖ్యలు సెతల్వాద్ అరెస్టుకు కారణమైతే శుక్రవారం బెయిలు అర్జీని పరిశీలించిన బెంచి ఇచ్చిన తీర్పు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రదర్శిస్తున్న భిన్న వైఖరికి తార్కాణం. కానీ బెయిలు మంజూరు చేసిన సందర్భంగా సుప్రీంకోర్టులో జరిగిన సంవాదం, ఆ తరవాత తీసుకున్న నిర్ణయం ఆసక్తికరమైనవి. జూన్ 25నుంచి సెతల్వాద్ నిర్బంధంలోనే ఉన్నా అందులో మొదటి ఏడు రోజులు పోలీసుల అధీనంలోనే ఉన్నా ఇంతవరకు చార్జిషీటే దాఖలు చేయకపోవడం ఏమిటని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను నిలదీశారు. కనీసం సాక్ష్యులనైనా విచారించలేదు. ఆమె బెయిలు కోసం ఆగస్టు 2న హైకోర్టుకు వెళ్తే బెయిలు ఇవ్వకపోగా కేసు విచారణను ఆరు వారాల పాటు అంటే సెప్టెంబర్ 19కి వాయిదా వేశారు. ఇలాంటి వ్యవహారాలలో అందునా ఒక మహిళ పెట్టుకున్న అర్జీ ఉన్నప్పుడు ఇంత సుదీర్ఘకాలం ఎలా వాయిదా వేస్తారు అని కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు తుషార్ మెహతా దగ్గర సమాధానం లేదు. సెతల్వాద్ మీద హత్య చేయడం, శారీరకంగా దాడి చేయడం లాంటి తీవ్రమైన ఆరోపణలు లేనప్పుడు, ఆమెను ప్రశ్నించడం ముగిసినప్పుడు బెయిలు నిరాకరించడమే కాక సుదీర్ఘ కాలం వాయిదా వేయడం ఏమిటని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపించింది. మోదీ ప్రభుత్వాన్ని నిలదీసే వారికి బెయిలు రాకుండా అడుగడుగునా అడ్డు పడడం, ఏదో ఒక సాకుతో వారు ఎక్కువ కాలం జైలులో ఉండేట్టు చేయడమే ప్రభుత్వ వైఖరి అని స్పష్టంగా కనిపిస్తోంది.

బెయిలు మంజూరు చేసిన సందర్భంగా సుప్రీంకోర్టులో జరిగిన సంవాదం, ఆ తరవాత తీసుకున్న నిర్ణయం ఆసక్తికరమైనవి. తీస్తా సెతల్వాద్ విషయంలో సుదీర్ఘ వాయిదాలు వేసిన కేసులు, పూర్వోదంతాలు ఏమున్నాయో చెప్పమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టు ప్రశ్నలు వేస్తున్నప్పుడు దిక్కు తోచని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నిందితురాలి గురించి నేర విచారణా ప్రక్రియ స్మృతి (సీఆర్.పి.సి.) సెక్షన్ 161, 164 ప్రకారం ఇచ్చిన వాంగ్మూలాల గురించి ప్రస్తావించారు. 164 ప్రకారం ఇచ్చే వాంగ్మూలాలు సీల్డ్ కవర్లో ఉంటే మీకెలా వచ్చాయి అని తుషార్ మెహతాను బెంచి ప్రశ్నించింది. సెతల్వాద్ గుజరాత్ ప్రభుత్వాన్ని, న్యాయవ్యవస్థను అపఖ్యాతి పాలు చేస్తున్నారనీ మెహతా వాదించారు. తుషార్ మెహతా ప్రస్తావించిన వాంగ్మూలాల పస ఏమిటో సెతల్వాద్ తరపు న్యాయవాది కపిల్ సిబల్ తేల్చేశారు. ఈ వాంగ్మూలాలను న్యాయస్థానం ఇదివరకే తోసిపుచ్చిన వాస్తవాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సెతల్వాద్ మీద పోలీసులు చేసిన అభియోగం జకియా జాఫ్రీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా చేసినవే తప్ప మరేమీ లేదని ప్రధాన న్యాయమూర్తితో కూడిన బెంచి వ్యాఖ్యానించింది. గుజరాత్ హైకోర్టులో కేసులు ఎక్కువగా ఉన్నందువల్ల సుదీర్ఘ వాయిదాలు వేయవలసి వస్తోందన్న తుషార్ మెహతా వాదనను ఖండిస్తూ రెండు రోజుల్లోనే బెయిలు మంజూరు చేసిన సందర్భాలు ఇటీవలి కాలంలోనే 28 ఉన్నాయని కపిల్ సిబల్ గుర్తు చేశారు. సెతల్వాద్ ఏ వ్యవస్థకూ, ఏ న్యాయమూర్తికి వ్యతిరేకంగా మాట్లాడిన సందర్భమే లేదని సిబల్ అన్నారు. సెతల్వాద్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలాలు ఇచ్చిన వారు ఇంతకు ముందు ఆమె దగ్గర పని చేసేవారని, ఆమె తొలగించినందువల్ల వారు ఇలాంటి వాంగ్మూలాలు ఇచ్చారని సిబల్ నిరూపించారు. సెతల్వాద్ కృషివల్ల 2002 గుజరాత్ మారణకాండ బాధితులు అనేక కేసులు దాఖలు చేయగలిగారనీ చాలా సందర్భాలలో కోర్టులు వారికి న్యాయం చేశాయని కూడా సిబల్ తెలియజేశారు. సెతల్వాద్ బెయిలు కోసం పెట్టుకున్న దరఖాస్తు గుజరాత్ హైకోర్టు పరిశీలనలో ఉంది కనక ఆ విచారణకు ఆటంకం కలిగించ కూడదని సుప్రీంకోర్టుకు చెప్పే సాహసం కూడా తుషార్ మెహతా చేశారు. హైకోర్టులో న్యాయం జరగ లేదనుకున్నప్పుడు ఎవరైనా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చునన్న సహజ న్యాయ సూత్రాన్ని కూడా ఆయన ఖాతరు చేయలేదు. తీస్తా సెతల్వాద్ తప్పు చేశారా లేదా అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. ఆమెకు బెయిలుకు అర్హత ఉందా లేదా అన్నదే అసలు చర్చనీయాంశం. గుజరాత్ ప్రభుత్వం ఆమెకు బెయిలు మంజూరు చేయకుండా ఎన్ని అడ్డంకులు కల్పించాలని చూసినా సుప్రీంకోర్టు బెయిలు హక్కు అన్న సూత్రానికి కట్టుబడి ఉందని భావించి తాత్కాలిక బెయిలు మంజూరు చేసింది. ఇది ప్రస్తుత పరిస్థితుల్లో చాలా సానుకూల పరిణామం. న్యాయవ్యవస్థ కూడా అధికారంలో ఉన్న వారికి దాసోహం అన్న రీతిలో వ్యవహరించడానికి వేసిన అడ్డుకట్ట. ఏదో కేసు విషయంలో సుప్రీం వ్యాఖ్యల ఆధారంగా సెతల్వాద్ మీద కేసు మోపారు. సుప్రీం వ్యాఖ్యలకు వక్రభాష్యం చెప్పే వారికి ఈ బెయిలు గుణపాఠం కావాలి.

మోదీని నిలువరిస్తేనే రాజ్యాంగానికి రక్ష

నిత్య చక్రవర్తి

లోకసభకు 2024లో జరగనున్న ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని అడ్డుకొని ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని ఈ పాలకులు కల్పించారు. ప్రత్యామ్నాయానికి అవకాశాలున్నాయి. ప్రత్యామ్నాయం కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేయాలి. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఎక్కువగా బలోపేతంగా ఉన్నాయి. అందుకనే మోదీ ఒకదాని తర్వాత మరో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చివేస్తున్నారు. అయితే అత్యంత బలహీనపడిన కాంగ్రెస్ మినహా తక్కిన ప్రతిపక్షాలు ఐక్య సంఘటనగా ఏర్పడితేనే సాధ్యం. మోదీని గద్దె దించాలని భావిస్తే సరిపోదు. అందుకు అవసరమైన భూమికను ఏర్పాటు చేసుకోవాలి. ఐక్య సంఘటన ఏర్పాటుకు అనేక అవరోధాలు ఎదురవుతాయి. వాటిని అధిగమించి ఐక్యమైతేనే స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుంది. ఈ దిశలో ప్రయత్నాలు గతంలోనూ, ఇప్పుడు జరుగుతున్నాయి.

ప్రధాని పదవికి మమత, కేసీఆర్, కేజ్రీవాల్, నితీశ్ కుమార్ తదితరులు పోటీపడితే లక్ష్యం నెరవేరకపోగా, స్వాతంత్ర్యానికి, రాజ్యాంగానికి, దేశ ప్రజల ప్రయోజనాలకు తీవ్ర హాని తప్పదని ఎనిమిదేళ్ల బీజేపీ పాలన స్పష్టం చేసింది. సామాన్య, మధ్య తరగతి ప్రజల, కార్మికుల, రైతుల జీవితాలు అల్లకల్లోలమయ్యాయని కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం. దీన్ని కప్పిపెట్టి అబద్ధాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. హిట్లర్ హయాంలో అబద్ధాల ప్రచారానికి గోబెల్స్ ఒక్కడే ఉండగా నేడు లక్షల మంది గోబెల్స్ ఉన్న పకడ్బందీ ప్రచార యంత్రాంగం పాలకుల కనుసన్నల్లో 24 గంటలూ పని చేస్తోంది.

80 పైగా సీట్లు తగ్గుతాయి

మోదీ విధానాలను, అనుసరించే పద్ధతులను వ్యతిరేకించువారు ఎవరైనా వారి పైకి సిబిఐ, ఈడీ లాంటి సంస్థలు దాడులు చేసి వారిపై ఆరోపణలకు రుజువులు లేకపోయినా గోబెల్స్ అబద్ధాల ప్రచారం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈసారి (2024) బీజేపీకి 80 పైగా సీట్లు ఖచ్చితంగా తగ్గుతాయని, ప్రజల్లో ఈ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరిగిందని కొన్ని మీడియా సంస్థలు, ఎన్నికల ఫలితాల ఏజెన్సీల విశ్లేషణలు, సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.

మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చినా తక్కువ మెజారిటీతో పాలించవలసి ఉంటుందని కొన్ని సర్వేలు వెల్లడించాయి. 240 నుండి 250 సీట్లు రావచ్చునని మరికొన్ని సంస్థలు తెలిపాయి. 2019లో వలె ఈ అంచనాల్లో మార్పులు ఉండవచ్చునన్న విశ్లేషకులు ఉన్నారు. ఇప్పటికే మోదీ ప్రభుత్వ వైఫల్యాల వైపు ఆలోచించకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు రకరకాల ట్రిక్కులు ప్రయోగిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వాల కూల్చివేత, మరోవైపు ఎన్నికల ఏర్పాట్లు, కుల, మత సమీకరణలు, పలుకుబడి గలిగిన సినీ నటులను, స్థానిక పార్టీల నాయకులను, బలమైన కులాల, మతాల నాయకులను ఆకర్షించే పనిలో అమిత్‌షా తల మునకలై ఉన్నారు. 2019 లోకసభ ఎన్నికల తరవాత గడచిన 39 నెలల కాలంలో వివిధ రాష్ట్రాలలో స్థానిక సంస్థలకు, మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో గణనీయమైన మార్పులు కనిపించాయి. 2019లో బీజేపీ గరిష్టంగా 303 స్థానాలు గెలుచుకుంది. 1984లో రాజీవ్‌గాంధీ హయాంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 404 సీట్లలో విజయం పొందింది. ఆ తరవాత 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ సీట్లు సగానికి పైగా తగ్గిపోయాయి. దక్షిణాదిన గల 5 రాష్ట్రాలలో కలిపి 129 లోకసభ స్థానాలు ఉండగా బీజేపీ 29 గెలుచుకుంది. వీటిలో ఒక్క కర్ణాటకలోనే 25 సీట్లు, తెలంగాణలో 4 సీట్లు గెలుపొందింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈసారి కూడా ఒక్క సీటు కూడా గెలుచుకునే అవకాశం లేదు.

ఆంధ్రాలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బలమైన స్థానంలో ఉన్నది. బీజేపీకి పెద్దగా ఓట్లు లేవు. తెలంగాణలో ఎంత హడావుడి చేసినా బీజేపీ అదనంగా సీట్లు గెలుచుకునే పరిస్థితులు లేవు. కర్ణాటకలో 2023లో అసెంబ్లీకి 2024లో లోకసభకు జరిగే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోరాటమే జరిగే అవకాశం ఉంది. గతంలో గెలుచుకున్న 25 సీట్లలో ఈసారి బీజేపీకి తగ్గే అవకాశమే ఉంది. కాంగ్రెస్ నాయకులంతా కలిసి పని చేస్తున్నందున అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందితే బీజేపీ పరిస్థితి మరింత కష్టంగా తయారవుతుంది. తాజాగా లింగాయత్‌లు ఆరాధించే మఠాధిపతిని అరెస్టు చేశారు. తన దగ్గరకు వచ్చే బాలికలపై అత్యాచారానికి పాల్పడిన నేరంపై అరెస్టు చేశారు. ఈ సంఘటన కూడా కాంగ్రెసుకు కలిసి వచ్చేదేనని భావిస్తున్నారు. ప్రస్తుత బీజేపీ మంత్రులలో ఎక్కువ మంది అవినీతిపరులయ్యారని కాంట్రాక్టర్లే బట్టబయలు చేశారు. ఒక్కొక్క కాంట్రాక్టుకి కేటాయించే మొత్తంలో 40 శాతం మంత్రికి ఇవ్వవలసి వస్తున్నదని ప్రధాన మంత్రికి లేఖ రాసిన తర్వాత ఒక కాంట్రాక్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత లోకసభ ఎన్నికల్లో మోదీకి మద్దతు తెలిపిన ఐటి పరిశ్రమ యజమానులలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. హిందుత్వ గ్రూపులు చెలరేగడంతో సామాజిక సామరస్యత పూర్తిగా కొరవడింది.

బెంగాల్, బిహార్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోనూ బీజేపీ పరిస్థితి ఆశాజనకంగా ఉండే అవకాశం లేదు. బెంగాల్‌లో 2019 ఎన్నికల్లో బీజేపీ 18 సీట్లు గెలుచుకుంది. ఈసారి వీటిల్లో కనీసం 12 సీట్లు కోల్పోయే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. లోకసభ ఎన్నికల తర్వాత అసెంబ్లీ, స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం తీవ్రంగా పడిపోయింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని అవినీతి ప్రభుత్వంగా చూపించేందుకు మాజీ మంత్రి పార్థ చటర్జీని అవినీతి కేసుపై అరెస్టు చేశారు. బీర్‌భమ్ జిల్లాలో బలమైన నాయకుడు అనుబ్రత మండల్ పైన కూడా దర్యాప్తు సంస్థలు దాడులు జరిపాయి. అయినప్పటికీ మమత ప్రభుత్వానికి పెద్దగా నష్టం ఉండే అవకాశం లేదు. 2023 పంచాయతీ ఎన్నికల్లో, 2024 లోకసభ ఎన్నికల్లో మమత పార్టీ టిఎంసికి బలం తగ్గే అవకాశం లేదని సర్వేలు చెబుతున్నాయి. ఇటీవలే బిహార్‌లో నితీశ్‌కుమార్ ఎన్‌డిఏ నుండి వైదొలగి జేడీయు తదితర అయిదు పార్టీలతో కలిసి మహాఘట బంధన్ కూటమిని ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని నెలకొల్పారు. ఈ పరిణామం నేపథ్యంలో బీజేపీకి ఈసారి రెండు, మూడు లోకసభ స్థానాల కంటే ఎక్కువ గెలిచే అవకాశం లేదు. కనీసం 14 లేదా 15 సీట్లు కోల్పోనున్నది. బిహార్ సీమాంచల్ ప్రాంతంలో అమిత్‌షా పర్యటించనున్నారు. దీంతో మతాల మధ్య ఘర్షణలు జరగవచ్చున్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోనూ బీజేపీకి నిరాశే ఎదురవుతుంది. ఒడిశాలో నవీన్ పట్నాయక్ పార్టీ బీజేడీ చాలా బలంగా ఉంది. ఒడిశాలో మొత్తం 21 స్థానాలకు గాను గతంలో గెలుచుకున్న ఎనిమిది సీట్లలో ఎక్కువ కోల్పోనున్నారు. అలాగే జార్ఖండ్‌లో కూడా బీజేపీ పరిస్థితి దిగజారుతుంది.

కేంద్రంలో అధికారం పొందాలంటే ఉత్తరాది రాష్ట్రాలే ఎవరికైనా ఎక్కువ దోహదం చేస్తాయి. 2019లో ఈ ప్రాంతంలోని రాష్ట్రాల్లో ఉన్న 192 స్థానాల్లో బీజేపీ 156 గెలుచుకుంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాల్లోనూ బీజేపీ కనీసం 25 సీట్లు కోల్పోనున్నది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 స్థానాలుండగా 2019లో 62 సీట్లు గెలుచుకున్నది. ఈసారి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో బీజేపీ సీట్లు పెంచుకునే అవకాశం ఉంది. అయితే సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్‌యాదవ్ ఇతర పార్టీలతో కలిసి క్షేత్రస్థాయిలో పని చేస్తున్న నేపథ్యంలో బీజేపీకి సీట్లు తగ్గినా తగ్గవచ్చు.

పంజాబ్‌లో బీజేపీ పరిస్థితి దారుణంగా ఉంది. గతంలో మొత్తం 13 స్థానాలకుగాను రెండు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈసారి వాటిని కూడా కోల్పోనున్నది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆప్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకునే అవకాశం కనిపిస్తోంది. దిల్లీలో గతంలో బీజేపీ అక్కడున్న ఏడు స్థానాలను క్లైవసం చేసుకోగా ఈసారి ఆప్ పార్టీ 5 లోకసభ స్థానాలను గెలుచుకున్నా ఆశ్చర్యపడవలసింది లేదు. ఆ పార్టీ నాయకుడు సిసోడియాపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలన్న బీజేపీ వ్యూహం ఫలించే అవకాశం కనిపించడంలేదు.

గతంలో 48 సీట్లున్న మహారాష్ట్రలో 23, గుజరాత్‌లో మొత్తం 26 సీట్లను బీజేపీ దక్కించుకుంది. ప్రస్తుతం మహారాష్ట్రలో పరిస్థితి స్పష్టంగా లేదు. గుజరాత్‌లోను బీజేపీ సీట్లు కోల్పోయే అవకాశమే కన్పిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల్లో గల 25 సీట్లలో గతంలో 12 సీట్లు గెలుచుకున్న బీజేపీకి ఈసారి తప్పనిసరిగా ఓట్లు, సీట్లు తగ్గనున్నాయి. ఏమైనా బీజేపీ సీట్లు 80కి పైగా ఈసారి తగ్గే అవకాశాలే ప్రస్తుతానికి ఉన్నాయి.

అబ్బే ఆయన వెళ్లిపోలేదు



ఆయన నిత్య యవ్వ నుడు. ఆయన నిత్య విద్యార్థి. ఆయన నిత్య నిరంతర సాహితీ ప్రేమి కుడు. కన్ను తెరిచింది మొదలు కన్ను మూసే వరకూ కవిత్వమే ఊపి రిగా బతికినవాడు. ఆయనే కీర్తిశేషులు అద్దే పల్లి రామమోహన్ రావు. అద్దేపల్లి రామమోహన్ రావుకి జీవితం వేరు, సాహిత్యం వేరు కాదు. ఆయన జీవితమే సాహిత్యం... సాహిత్యమే జీవితం. అలా బతికారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అద్దేపల్లికి అసంఖ్యాకంగా అభిమానులున్నారు. వయసుతో సంబంధం లేకుండా స్నేహితులున్నారు.

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

అద్దేపల్లి మరణానంతరం ఆయన వారసులు ప్రతి ఏటా సాహిత్య విమర్శ పురస్కారం ఇస్తున్నారు. ఈ ఏడాది ఆ పురస్కారాన్ని ఈ నెల 10 తేదీన అద్దేపల్లికి అత్యంత ఇష్టమైన కాకినాడలో ప్రముఖ విమర్శకులు కె.పి.అశోక్ కుమార్‌కు ప్రదానం చేస్తున్నారు.

ఎవరైనా కవులను తయారు చేస్తారా. ఎవరైనా తమంత తామే కవులుగా ఎదుగుతారు. కాని అద్దేపల్లితో పరిచయం ఉన్న వారెవ్వరైనా కవులుగా మారాల్సిందే. కలం పట్టి కవిత్వం రాయాల్సిందే. అలా ఉంటుంది అద్దేపల్లితో స్నేహం. ఈ స్నేహానికి కూడా వయోబేధాలు ఉండవు. 20 ఏళ్ల కుర్రాడి నుంచి 70 ఏళ్ల వృద్ధుడి వరకూ అద్దేపల్లికి స్నేహితులే. అద్దేపల్లి తెలుగు సాహిత్య రంగంలో ప్రవేశించిన కాలం ఆషామాషి కాలం కాదు. అనేకానేక వాదాలు తెలుగు సాహిత్యాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న కాలం అది. సృజన కారులు ఎటో అటు నిలబడాల్సిన కాలం అది. అలా నిలబడకపోతే కాలం నిలదీసిన సమయం అది. ఆ సమయంలో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించారు అద్దేపల్లి. రచన ఆయన సొంత విషయం, ఆయన కోపం వస్తే రాసారు. ఆయన దుఃఖిస్తే రాసారు. ఆయన సంతసిస్తే రాసారు. అందుకే ఆయన ఏ రచయితల సంఘంలోనూ చేరలేదు.

కవిత్వం రాయడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... ఇతర ప్రాంతాల్లో కూడా అద్దేపల్లి రామమోహన్ రావు విస్తృతంగా పర్యటించే వారు. ఆ పర్యటనల్లో అక్కడి పెద్ద కవులను కలవడమే కాదు... అప్పుడప్పుడే కవిత్వం రాస్తున్న యువ కవులతోనూ ఎక్కువ గడిపేవారు. 70 ఏళ్లు మీద పడినా ఇంకా యువకుడిగానే కనిపించడం తెలుగు సాహితీ రంగంలో ఒక్క అద్దేపల్లికే చెల్లింది. కవిగా, విమర్శకుడిగా, ఉప న్యాసకుడిగా, సాహితీ కార్య కర్తగా ఇలా బహుముఖాలలో కనిపించిన అద్దేపల్లికి సాహిత్యలోకంలో శత్రు వులు లేరు. ఆయనను విమర్శించిన వారితో కూడా ఎంతో ఆప్యాయంగా మాట్లాడడమే ఆయనకు తెలుసు. సాహిత్యం వేరు, వ్యక్తిగత స్నేహం వేరుగా చూసిన అద్దేపల్లిని అటు విరసం కాని, ఇటు అరసం కాని, మరే ఇతర సాహిత్య సంస్థలు కాని తమవాడిగానే పరిగణించాయి. బహుశా తెలుగు సాహిత్యంలో ఇలాంటి విశిష్టత కలిగిన, సొంతం చేసుకున్న ఏకైక వ్యక్తి అద్దేపల్లి. తనకు అనారోగ్యమని తెలిసినా.... అది తీవ్ర రూపం దాల్చిందని ఎరుక కలిగినా... మరో రెండు రోజుల్లో కాలం చేస్తారని డాక్టర్లు కుటుంబ సభ్యులకు చెప్పినా ఆనాడు ఒంగోలులో జరిగే సభకు వెళ్లి వచ్చేస్తానని మొండి పట్టుపట్టిన సాహిత్య ప్రేమికుడు అద్దేపల్లి రామమోహన్ రావు. విమర్శ గ్రంథాలు వచ్చాయి. కవిత్వ సంపుటాలు వెలువరించారు. పదుల సంఖ్యలో కవిత్వ సంపుటాలకు ముందుమాటలు రాసారు. తెలుగు సాహిత్యానికి ఆయన చాలా చేశారు. ఆయన చేయకుండా వదిలి వెళ్లిపోయిన వాటిని ఆయన వారసులు చేస్తున్నారు. ప్రతి ఏటా అద్దేపల్లి పేరిట సాహిత్య విమర్శకు ఓ పురస్కారం ఇస్తున్నారు. అంటే అద్దేపల్లి వెళ్లిపోలేదుగా. మన మధ్యే తిరుగుతున్నారుగా బహురూపాలలో.....

వ్యాస రచయిత సెల్ 9912019929

ఐ-మెయిల్

అమలుకాని హామీ కారాదు

రాబోయే ఐదేళ్లలో ప్లాస్టిక్ కాలుష్యం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షణీయం. మానవ జీవనంలో పాలు, పూలు, పళ్ళు, కూరగాయలు, శీతల పానీయాలు, ఆఖరికి వేడివేడి తినుబండారాలకు ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ సంచులే అన్నిటికి ఆధారంగా మారాయి. ప్లాస్టిక్ వాడకం ద్వారా అనారోగ్యం పాలౌతున్నామని తెలిసినా గత్యంతరంలేని పరిస్థితి. నగరం, పట్టణం, పల్లె అనే తేడా లేకుండా రూపాంతరం చెందింది. వాడి పాడేసిన ఈ వ్యర్థాలు తిని వందలాది పశువులు మరణిస్తున్నాయి. అప్పుడప్పుడు ప్రకటనలు చేసి, అక్కడక్కడా తనిఖీలు నిర్వహించినా ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం తగ్గిన జాడలేదు, అయినా ప్లాస్టిక్ తయారీ పరి శ్రమలకు అనుమతులు మంజూరు చేయడం గమనార్హం. అలాగే ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషే ధమూ మంచి నిర్ణయమే! చిన్నచిన్న గ్రామాలలో సైతం లక్షలాది రూపాయలు వెచ్చించి యంత్ర సామాగ్రి స్థాపించి అనేక మంది పనివారలకు ఫ్లెక్సీ తయారీ ద్వారా ఉపాధి నందిస్తున్నారు. ముందుగా వారికి ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లు చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వస్త్ర బ్యానర్లు ప్రోత్సహించడం మూలంగా వస్త్ర విని యోగంతో పాటు రంగుల కళాకారులకు ఎంతోకొంత పని లభిస్తుంది. కాలుష్య సమస్య ఉత్పన్నం కాదు. ముఖ్యమంత్రి ప్రకటిస్తున్న ఇలాంటి ప్రజారంజక పథకాలు మేధావులు ప్రజల చెవులకూ వినసొంపుగా ఉంటున్నాయి, అయితే ఆచరణ అమలులో మాత్రం గడప దాటక పోవడం బాధాకరం. ఎన్నికల ముందు కంట్రిబ్యూటరీ పింఛను విధానం రద్దు ప్రకటించారు, అధికారం చేపట్టి నలభై నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదు. నిరుద్యోగు లకు జాబ్ క్యాలెండర్, సామాజిక పింఛను మూడు వేలకు పెంపు, అంచెలంచెలుగా మద్యపాన నిషేధం, సకాలంలో పోలవరం ప్రాజె క్టు నిర్మాణం, మూడు రాజధానులు, గుంతలు లేని రహ దారులు వంటి అనేక హామీల అమలుకై ఐదు కోట్ల ఆంధ్రులు ఎదురు చూస్తున్నారు. అటువంటి హామీలలో కాలుష్యం లేని ఆంధ్రప్రదేశ్ అమలు కాని హామీ కారాదు.

యర్రమోతు ధర్మరాజు,
9440263849.

కోడ్‌లతో హక్కుల హననం!

వై. పార్వతి

లేబర్ కోడ్‌లను అమలు చేయాలని రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి తీసు కొస్తోంది. అదే సమయంలో తమ రాష్ట్రానికి పెట్టుబడులను రాబట్టుకునేందుకు, సులభతర వాణిజ్యానికి అనువైన వాతావరణాన్ని కల్పించుకునేందుకు ఈ కోడ్‌లను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. పని గంటలు, ఉపాధి భద్రత, కనీస వేతనం, పని ప్రదేశాల్లో రక్షణ, ఆరోగ్యకరమైన పని పరి స్థితులు, పరిహారం, పదవీ విరమణ అనంతరం భృతి, జీవితకాల ఉద్యోగ భద్రత... తదితర అంశాల పట్ల యాజమాన్యాలు బాధ్యత పడటం వారి కనీస ధర్మం. కార్మికుల విస్తృత పోరాట ఫలితంగా శ్రమజీవుల బతుకుదెరువులకు భరోసా కల్పిస్తూ అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. అయితే 1990ల తర్వాత ప్రపంచీకరణ కాలంలో కార్మిక హక్కుల హననం క్రమంగా కొనసాగుతూ, 4 కోడ్‌లతో పరాకాష్టకు చేరింది. కార్పొరేట్ అనుకూల నాలుగు కోడ్‌లను కేంద్రం రద్దు చేసేంతవరకూ కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణమిది.

దేశంలో కార్మికుల హక్కులు చట్టబద్ధంగానే ఆవిరైపోతున్నాయి. దశాబ్దాలుగా భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కాలరాసి కార్పొరేట్ కంపెనీల, యజమానుల ప్రయోజనాలకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించిన చట్టాన్ని రద్దు చేయాలని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెండేళ్లుగా కార్మిక సంఘాలు పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, సామాజిక భద్రత కోడ్ 2020, ఉద్యోగ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020, వేతనాల కోడ్ 2019 ఈ నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. కార్మిక సంఘాలతో కేంద్రం ఏర్పాటు చేసిన సమావేశాల్లో లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని చాలా సంఘాలు డిమాండ్ చేసినా మోదీ సర్కార్ వాటి అమలుకు దూకుడుగా ముందుకుపోతోంది. కార్మికుల/వలస కార్మికుల వేతనాలు, ఉమ్మడి బేరసారాలు, సమ్మె హక్కులు, పని పరిస్థితులు, సామాజిక భద్రతకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించకుండా నాలుగు లేబర్ కోడ్‌లు అమలుకై కేంద్రం పట్టుబడుతోంది. గత నెల 25, 26 తేదీల్లో తిరుపతిలో రాష్ట్రాల కార్మిక మంత్రులు, లేబర్ కమిషనర్లతో కేంద్రం లేబర్ కోడ్‌ల కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకునేందుకు ఒక సమావేశాన్ని నిర్వహించింది. కార్మిక వర్గ వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, నిరుద్యోగం, ధరల పెరుగుదల సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర ఉపాధి కల్పన పథకాన్ని పట్టణ పేదలకు కూడా విస్తరింప చేయాలని ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు వివిధ రూపాల్లో ఉద్యమాలు చేపట్టాయి. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నట్లే, ఈ నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం రద్దు చేసేదాకా పోరాటం కొనసాగించాలని ట్రేడ్ యూనియన్లు కంకణం కట్టుకున్నాయి.

'సబ్ కా సాత్, సబ్ కా వికాస్ (అందరికి అండగా ఉంటాం, అందరి అభివృద్ధికి పాటుపడతాం) నినాదం ఇచ్చే మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించింది. పెద్ద సంఖ్యలో ఉన్న చట్టాలను కుదించడం వల్ల వాటిని అర్థం చేసుకోవడం కానీ, అమలు చేయడం కానీ సులభతరం అవుతుందని ప్రభుత్వం వాదిస్తోంది, ప్రచారం చేస్తోంది. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా, లేబర్ కోడ్‌లకు ఆమోదం లభించినట్లుగా భావిస్తోంది. 12 గంటల పాటు పని, కార్మికుల సమ్మె హక్కులు కాల రాయడం, ఉద్యోగ భద్రతను కోల్పోవడం, అమానవీయ పని పరిస్థితులు వంటి చర్యలకు కేంద్రం పాల్పడింది.

కోవిడ్ నేపథ్యంలోనూ కార్పొరేట్ సంస్థలు ఇప్పటికే ఈ విధానాలు అమలు చేస్తున్నాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ పేరున పని గంటలు పెంచి, వేతనాలు తగ్గించడమే కాకుండా కోట్లాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. ఓలా, జొమాటో వంటి ఈ-కామర్స్ ఆధారిత చిల్లర పనులకు సంబంధించిన 'గిగ్' (నిర్ణీత కాలం పాటు, స్వల్పకాలిక ఒప్పందాలతో మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించే మార్కెట్ వ్యవస్థ) ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను అందిపుచ్చుకుని 'గ్లోబల్ లీడర్'గా అవతరించాలనే భారతీయ కార్పొరేట్ ఆకాంక్షలకు ఈ కోడ్‌లు ఆలంబనగా నిలుస్తాయి. సాధారణ కార్మికులకు ఉండే హక్కులకు కూడా ఈ గిగ్ ఉద్యోగులు నోచుకోరు. గిగ్ ఉద్యోగులు పడుతున్న అవస్థలు దారుణంగా ఉన్నాయి. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది.

లేబర్ కోడ్‌లను అమలు చేయాలని రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి తీసు కొస్తోంది. అదే సమయంలో తమ రాష్ట్రానికి పెట్టుబడులను రాబట్టుకునేందుకు, సులభతర వాణిజ్యానికి అనువైన వాతావరణాన్ని కల్పించుకునేందుకు ఈ కోడ్‌లను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. పని గంటలు, ఉపాధి భద్రత, కనీస వేతనం, పని ప్రదేశాల్లో రక్షణ, ఆరోగ్యకరమైన పని పరిస్థితులు, పరిహారం, పదవీ విరమణ అనంతరం భృతి, జీవితకాల ఉద్యోగ భద్రత... తదితర అంశాల పట్ల యాజమాన్యాలు బాధ్యతపడటం వారి కనీస ధర్మం. కార్మికుల విస్తృత పోరాట ఫలితంగా శ్రమజీవుల బతుకుదెరువులకు భరోసా కల్పిస్తూ అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. అయితే 1990ల తర్వాత ప్రపంచీకరణ కాలంలో కార్మిక హక్కుల హననం క్రమంగా కొనసాగుతూ, 4 కోడ్‌లతో పరాకాష్టకు చేరింది. కార్పొరేట్ అనుకూల నాలుగు కోడ్‌లను కేంద్రం రద్దు చేసేంతవరకూ కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణమిది.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్
9490793437

యూపీలో కుల రాజకీయం

- ఎస్సీ జాబితాలో ఓబీసీల చేర్పునకు హైకోర్టు నిరాకరణ
- పాలక బీజేపీపై ఎస్పీ, కాంగ్రెస్ మండిపాటు
- ఓట్ల కోసం నాటకమంటూ విమర్శలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో కుల రాజకీయ మంటలు చెలరేగాయి. షెడ్యూల్డ్ కులాల జాబితాలో 18 ఓబీసీ కులాలను చేరుస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను అలహాబాద్ హైకోర్టు తాజాగా కొట్టివేసింది. ప్రధాన రాజకీయ పార్టీలు 2024 లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో ఈ అంశం తెరపైకి రావడం రాజకీయ పార్టీలకు కావాల్సినంత మేత అందించినట్లు అయింది. ఇతర వెనుకబడిన తరగతుల హక్కుల కోసం అటు అసెంబ్లీలోనూ, ఇటు వీధుల్లోనూ పోరాటం చేస్తామని ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ ప్రతినబూనగా ఓబీసీలను పాలక బీజేపీ మోసగించిందని కాంగ్రెస్ విమర్శించింది. ఓట్లు వేయించుకొని అధికారం చేపట్టిన తర్వాత ఓబీసీలకు తీరని అన్యాయం చేసిందని మండిపడింది. ఓబీసీలలోని మత్స్యకార వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ మిత్రపక్షం నిషాద్ పార్టీ కోర్టు తీర్పును స్వాగతించింది. ఓబీసీలను ఎస్సీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్లు ఇవ్వడం అన్యాయం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఆ సమస్యపై తాము పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో లాబీయింగ్ చేయడం ద్వారా ఓబీసీలకు న్యాయం చేసేలా ప్రయత్నిస్తామని, బీజేపీ సరైన చర్య తీసుకుంటుందని భావిస్తున్నామని నిషాద్ పార్టీ అభిప్రాయపడింది. ఎస్సీ జాబితాలో 18 ఓబీసీ కులాలను చేరుస్తూ 2016, 2019లో రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన నోటిఫికేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ జేజే మనీర్‌తో కూడిన అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం విచారించింది. 2016లో అఖిలేశ్ యాదవ్ ప్రభుత్వం, 2019లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్లు ఇచ్చాయి. అయితే, వీటి అమలుపై కోర్టు ఆంక్షలు విధించింది. ఓబీసీ కులాలను ఎస్సీ కేటగిరిలో చేరుస్తూ ములాయంసింగ్ యాదవ్ ప్రభుత్వం కూడా 2005లో ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై హైకోర్టు అప్పుడూ స్టే విధించింది. రెండేళ్ల తర్వాత మాయావతి ప్రభుత్వం ఈ ఉత్తర్వులను రద్దు చేసింది. ఆ తర్వాత కొంత కాలానికి ఎస్సీ కేటగిరిలో కొన్ని ఓబీసీ కులాలను చేర్చడానికి సుముఖత వ్యక్తంచేస్తూ మాయావతి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఓబీసీలకు చెందిన మజ్వర్, కుహర్, కశ్యప్, కెవత్, మల్లా, నిషాద్, కుమ్హర్, ప్రజాపతి, ధీవార్, బింద్, భర్, రాజ్‌భర్, ధిమన్, బాతం, తురా, గొడియా, మాంజీ, మచువా కులాలను ఎస్పీ, బీఎస్పీ ప్రభుత్వాలు ఎస్సీ కేటగిరిలోకి మార్చడానికి సుముఖంగా ఉన్నాయి. ఈ కులాల జనాభా ఉత్తరప్రదేశ్‌లో సగానికి పైగా ఉంది. మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లో ఈ కులాలు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్న వేళ ఎస్సీ జాబితాలో కొంతమంది ఓబీసీలను చేర్చడం, చేర్చకపోవడం అనేది అజెండాగా మారింది. ఓబీసీలను ఎస్సీ కేటగిరిలో చేర్చడం ద్వారా యాదవుల ఆధిపత్యం గల ఎస్పీ..ఇతర ఓబీసీ కులాలపై ప్రభావం చూపాలని కోరుకుంటున్నది. ఇందుకోసం చిన్నా చితకా కుల పార్టీలు-అప్నాదళ్(కమర్వాడి), మహన్ దళ్, జనవాదీతో ఎస్పీ పొత్తులు పెట్టుకుంటున్నది. యాదవేతర ఓబీసీ కులాల మద్దతు కోసం పాలక బీజేపీ ప్రయత్నిస్తోంది. అప్నాదళ్(సోనేవాల్), నిషాద్ పార్టీ బీజేపీ మిత్రపక్షాలుగా ఉన్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఓబీసీల అంశాన్ని ఉపయోగించుకోవాలని ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నాయి. వాస్తవంగా ఓబీసీలను ఎస్సీ కేటగిరిలో చేర్చడం బీజేపీకి ఏమాత్రం ఇష్టం లేదని, హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం వెనుక పాలక పార్టీ ఉందని ఎస్పీ నేత రాజ్‌పాల్ కశ్యప్ ఆరోపించారు. ఓబీసీల హక్కులను యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం లాగేసుకుంటున్నదని, సుదీర్ఘ చర్చ తర్వాత తమ నాయకుడు అఖిలేశ్ యాదవ్ నోటిఫికేషన్ ఇచ్చారని ఆయన తెలిపారు. నిజానికి ఆ 18 కులాలు ఎస్పీతోనే ఉన్నాయని చెప్పుకున్నారు. ఓబీసీలకు బీజేపీ తాయిలాలు ఇస్తూ అసలైన హామీని అమలు చేయడం లేదని, అత్యంత వెనుకబడిన 18 కులాలకు పూర్తిగా ద్రోహం చేసిందని ఎస్పీ ట్విట్టర్ వేదికగా విమర్శించింది. కాంగ్రెస్ సైతం బీజేపీపై విరుచుకుపడింది. ఎన్నికల తర్వాత 18 ఓబీసీ కులాలను ఎస్సీ కేటగిరిలో చేరుస్తామన్న హామీని బీజేపీ తుంగలో తొక్కిందని విమర్శించింది. ఓబీసీ కులాలకు న్యాయం చేయాలని బీజేపీ కోరుకుంటే కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని కాంగ్రెస్ నేత అన్షు అవస్థి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై బీజేపీ ఇంతవరకు స్పందించలేదు.

లుఫ్తాన్సా విమానాలు రద్దు

ఢిల్లీ విమానాశ్రయంలో చిక్కుకున్న 700 మంది ప్రయాణికులు

న్యూఢిల్లీ : వేతనాల పెంపు డిమాండుతో పైలట్ల మెరుపు సమ్మెతో జర్మనీకి చెందిన విమానయాన సంస్థ లుఫ్తాన్సా విమాన సేవలు నిలిచిపోయాయి. వందల విమానసేవలు రద్దు కావడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-3 వద్ద శుక్రవారం 700 మంది వరకు ప్రయాణికులు చిక్కుకుపోయారు. ప్రయాణికులు, వారి కుటుంబసభ్యులు, బంధువులు విమానాశ్రయం వద్ద ఆందోళనకు దిగారు. టికెట్ డబ్బులు తిరిగివ్వాలి లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండు చేశారు. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 3, డిపార్చర్ గేట సంబరు 1 వద్ద ప్రధాన మార్గంలో భారీగా జనం గుమ్మిగూడారని గురువారం అర్ధరాత్రి 12.15 గంటలకు తమకు సమాచారం అందినదని సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. జనం పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందన్నారు. టికెట్ డబ్బులను తిరిగి ఇవ్వాలని లేకపోతే ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేయాలని డిమాండు చేస్తున్నట్లు విమానాశ్రయ డీసీపీ తనూ శర్మ తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా విమానాలు రద్దు అయినట్లు తెలుపగా వారంతా ఆందోళనకు గురయ్యారని, సీఐఎస్ఎఫ్, ఎయిర్‌పోర్టు సిబ్బంది వారికి నచ్చచెప్పే ప్రయత్నాలు చేశారని, పరిస్థితి అదుపులోనే ఉందని అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 2.50 గంటలకు 300 మంది ప్రయాణికులతో ఫ్రాంక్‌ఫర్ట్‌కు; 400 మందితో అర్ధరాత్రి 1.10 గంటలకు మునిచ్‌కు బయల్దేరాల్సిన రెండు లుఫ్తాన్సా విమానాలు రద్దు అయ్యాయని డీసీపీ చెప్పారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు విమానాయాన సంస్థ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కాగా, లుఫ్తాన్స ప్రపంచవ్యాప్తంగా 800 విమానాలను రద్దు చేయడంతో దాదాపు 1,30,000 మంది ప్రయాణికులపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేతనాలను 5.5 శాతం మేర పెంచాలని, 2023కి ద్రవ్యోల్బణం సర్దుబాట్లను పైలట్లు డిమాండ్ చేస్తున్నారని సమాచారం. చర్చలు విఫలం కావడంతో వారు మెరుపు సమ్మెకు దిగడంతో గందరగోళం నెలకొంది.

రూ.5 కోట్లకు పైగా జీఎస్‌టీ ఎగవేతదారులపై విచారణ

న్యూఢిల్లీ : ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఎగవేత లేదా దుర్వినియోగం మొత్తం రూ.5 కోట్ల కంటే ఎక్కువ ఉన్నట్లయితే జీఎస్‌టీ అధికారులు ఇప్పుడు ఎగవేతదారులపై విచారణ ప్రారంభించవచ్చని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, ఈ ద్రవ్య పరిమితి అలవాటు ఎగవేతదారుల విషయంలో లేదా దర్యాప్తు సమయంలో అరెస్టలయిన సందర్భాల్లో వర్తించదు. 'విచారణ ప్రారంభించాలా వద్దా అని నిర్ణయించడానికి ముఖ్యమైన అంశాలలో ఒకటి తగిన సాక్ష్యాధారాల లభ్యత' అని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధ్వర్యంలోని జీఎస్‌టీ దర్యాప్తు విభాగం విచారణ ప్రారంభించడానికి సూచనలను జారీ చేస్తూ పేర్కొంది. పన్ను ఎగవేత, లేదా ఐటీసీ దుర్వినియోగం, లేదా మోసపూరితంగా పొందిన రీఫండ్ రూ. 5 కోట్ల కంటే ఎక్కువగా ఉన్న చోట విచారణను సాధారణంగా ప్రారంభించడం జరుగుతుందని వివరించింది. పన్నుల ద్వారా విచారణ ప్రారంభించడం అంటే నేరస్థుడిపై చట్టపరమైన చర్యలను ప్రారంభించడం.

రాహుల్ భారత్ జోడో యాత్రకు స్టాలిన్

న్యూఢిల్లీ: సెప్టెంబరు 7న భారత్ జోడో యాత్ర ప్రారంభానికి ముందు శ్రీపెరంబుదూర్‌లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ మెమోరియల్ వద్ద జరిగే కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పాల్గొంటారు. ఆ తర్వాత కన్యాకుమారిలో జరిగే కార్యక్రమంలో రాహుల్‌గాంధీని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కలిసి జాతీయ జెండాను అందజేస్తారని కాంగ్రెస్ వర్గాలు శుక్రవారం తెలిపాయి. మహాత్మాగాంధీ మండపం వద్ద జరిగే కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, స్టాలిన్ సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారు. ఇక్కడ బహిరంగ సభతో రాహుల్ భారత్ జోడో యాత్ర ప్రారంభమవుతుంది. సెప్టెంబరు 8వ తేదీ ఉదయం ఏడు గంటలకు కన్యాకుమారి నుంచి శ్రీనగర్‌కు 3,570 కిలమీటర్ల పాదయాత్రను రాహుల్ ప్రారంభిస్తారు. రాహుల్ యాత్ర సెప్టెంబరు 11న కేరళ చేరుతుంది. 18 రోజులపాటు రాష్ట్రంలో పాదయాత్ర కొనసాగుతుంది. సెప్టెంబరు 30న కర్ణాటక చేరుతుంది. కర్ణాటకలో 21 రోజులు రాహుల్ పాదయాత్ర చేస్తారు.

సముద్ర భద్రతకు 'విక్రాంత్' : రాహుల్

గత ప్రభుత్వాల సమష్టి కృషి ఫలితం- మోదీ నయవంచన : కాంగ్రెస్

న్యూఢిల్లీ : సముద్ర భద్రతకు ఐఎన్ఎస్ విక్రాంత్ కీలక ముందడుగుగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం అభివర్ణించారు. నేవీ, నేవల్ డిజైన్ బ్యూరో, కొచ్చిన్ షిప్‌యార్డ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భారత నావికా దళంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్ చేరికను స్వాగతించారు. సముద్ర భద్రతకు ఐఎన్ఎస్ విక్రాంత్ కీలకమన్నారు. అనేక సంవత్సరాల శ్రమకు తగ్గ ఫలితం దక్కిందని, ఐఎన్ఎస్ విక్రాంత్ విజన్.. వాస్తవరూపం దాల్చిందంటూ విమాన వాహక నౌక చిత్రాన్ని ట్విట్టర్‌లో రాహుల్ గాంధీ పోస్టు చేశారు.

ఇదిలావుంటే, ఎక్కడ ఏం జరిగినా అది తన ఘనతగా నయవంచన చేయడం ప్రధాని నరేంద్రమోదీకి పరిపాటిగా మారిందని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను ప్రారంభించిన సందర్భంగా దీనిని తమ ప్రభుత్వ ఘనతగా ఆయన గొప్పలు పోయారుగానీ గత ప్రభుత్వాల సమష్టి కృషి ఫలితంగా అతిపెద్ద విమాన వాహక నౌక నిర్మాణం సాధ్యమైందన్న విషయాన్ని విస్మరించారని దుయ్యబట్టింది. 2013 ఆగస్టులో ఐఎన్ఎస్ విక్రాంత్‌ను అప్పటి రక్షణ మంత్రి ఏకే ఆంటోని ప్రారంభించిన వీడియోను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పోస్టు చేశారు. భారత నావికా దళ అమ్ములపొదిలోకి ఐఎన్ఎస్ విక్రాంత్ చేరే సమయానికి మోదీ ప్రభుత్వం అధికారంలో ఉంది తప్ప దాని నిర్మాణ ఘనత వారికి చెందదన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దీనిలో ఎటువంటి సంబంధమూ లేదు. నేవీలో నౌక చేరిక సమయానికి అది అధికారంలో ఉంది అంతే. ఏకే ఆంటోని చాలా ఏళ్ల కిందట ఐఎన్ఎస్ విక్రాంత్‌కు శ్రీకారం చుట్టారు. డిజైన్, తయారీ, పరీక్ష, ప్రారంభం, అమ్ములపొదికి చేర్చడానికి మొత్తం 22 ఏళ్లు పట్టింది. మోదీ ప్రభుత్వం చేసినదల్లా దానిని లాంఛనంగా ప్రారంభించడమే.. దీని మొత్తం ఘనత తనదే అన్న మోదీది నయవంచన కాక మరేమిటి? అని పీటీఐతో మాట్లాడిన రమేశ్ అన్నారు. దీని ఘనత గత ప్రభుత్వాలకు, నేవీకి, శాస్త్రవేత్తలకు, ఇంజినీర్లకు, షిప్‌యార్డ్ వర్కర్లకు చెందుతుందన్నారు. దేశ శక్తిసామర్థ్యాలను మరింత పెంచే సాధనమిది అని చెప్పారు. ఏకే ఆంటోని ప్రసంగించిన వీడియోను జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. ఆత్మనిర్భర్ భారత్ 2014 ముందే ఉందన్నారు. 1999 నుంచి కేంద్ర ప్రభుత్వాల సమష్టి కృషి ఫలితంగా తొలి దేశీయ అతిపెద్ద విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ నేడు అందుబాటులోకి రాగలిగిందని మోదీ అంగీకరిస్తారా? 1971 యుద్ధంలో మొదటి ఐఎన్ఎస్ విక్రాంత్ సేవలను అందించింది. దానిని బ్రిటన్ నుంచి తీసుకురావడంలో కృష్ణామీనన్ కీలక పాత్ర పోషించారు. పరిపాలన కొనసాగింపుపై మోదీకి విశ్వాసం లేదు. 2014కు ముందు అసలు ఏమీ జరగనట్లు.. అంతా తానే చేసినట్లు నయవంచన చేసుకోవడం ఆయనకు అలవాటు అయింది. 1857లో రక్షణ మంత్రిగా మీనన్ రక్షణ రంగంలో స్వీయసమృద్ధికి నాంది పలికారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నారు. అప్పటి స్వీయసమృద్ధి, ఆత్మనిర్భర్ రక్షణ ఉత్పత్తి సామర్థ్యాన్నే నేటి మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తున్నది' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

ఆస్పత్రిలో అనారోగ్యంతో ఉన్న పద్మశ్రీ పురస్కార గ్రహీతతో బలవంతంగా నృత్యం

భువనేశ్వర్ : పద్మశ్రీ పురస్కార గ్రహీత కమలా పూజారిని కటక్‌లోని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసే ముందు బలవంతంగా నృత్యం చేయించిన సామాజిక కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని ఒడిశాలోని పరాజ గిరిజన సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీయూలో వృద్ధురాలు నృత్యం చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. అయితే సీసీటీవీ ఫుటేజ్ ప్రామాణికత ధ్రువీకరణ కాలేదు. సామాజిక కార్యకర్త మమతా బెహెరా కూడా ఆమెతో కలిసి నృత్యం చేస్తూ కనిపించారు. 'నేను ఎప్పుడూ నృత్యం చేయాలని అనుకోలేదు. కానీ బలవంతంగా అలా చేశాను. నేను పదే పదే తిరస్కరించాను. కానీ ఆమె (బెహెరా) వినలేదు. నేను అనారోగ్యంతో ఉన్నాను. అలసిపోయాను' అని పూజారి కోరాపుట్ జిల్లాలోని టెలివిజన్ ఛానెల్‌తో అన్నారు. సామాజిక కార్యకర్తపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైతే తమ సభ్యులు ఆందోళన కార్యక్రమం చేపడతారని గిరిజన సంఘం 'పరాజ సమాజ' అధ్యక్షుడు హరీష్ ముదులి హెచ్చరించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వరితో సహా వివిధ పంటలకు చెందిన 100 రకాల దేశీయ విత్తనాలను సంరక్షించినందుకు 2019లో పద్మశ్రీ అవార్డు పొందిన పూజారి, కిడ్నీ సమస్యలతో కటక్‌లోని ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేరారు. ఆమె త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. సోమవారం ఆమె ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే ముందు ఈ ఘటన జరిగింది. పూజారిని ఐసీయూలో కాకుండా ప్రత్యేక గదిలో చేర్చినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. పూజారితో కలిసి నృత్యం చేసిన మహిళ ప్రత్యేక గదిలో ఆమెను సందర్శించేది' అని ఆసుపత్రి రిజిస్ట్రార్ (పరిపాలన) డాక్టర్ అబినాష్ రౌత్ చెప్పారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతతో అనేక సెల్ఫీలు కూడా తీసిన బెహెరా తనకు తెలియదని పూజారి అటెండర్ రాజీబ్ హియాల్ తెలిపారు. అయితే ఈ చర్య వెనుక తనకు ఎటువంటి చెడు ఉద్దేశం లేదని బెహెరా తెలిపారు. పూజారి ఒడిశాలోని ప్రధాన షెడ్యూల్డ్ తెగ అయిన పరాజ సామాజిక వర్గానికి చెందిన మహిళ. ఈ తెగ రాష్ట్ర గిరిజన జనాభాలో దాదాపు 4 శాతం మందిని కలిగి ఉంది.

ఢిల్లీ ఎల్‌జీ అధికార దుర్వినియోగం

ప్రధాని తక్షణమే తొలగించాలి: ఆప్

న్యూఢిల్లీ: అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు వీకే సక్సేనాను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్రమోదీని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) డిమాండ్ చేసింది. ముంబైలోని ఖాదీ లాంజ్‌లో ఇంటీరియర్ డిజైనింగ్‌కు సంబంధించిన కాంట్రాక్టును కేవీఐసీ చైర్మన్‌గా సక్సేనా తన కుమార్తెకు కట్టబెట్టారని విమర్శించింది. చట్టాన్ని ఉల్లంఘించి తన కుమార్తె శివంగి సక్సేనాకు కాంట్రాక్టు ఇచ్చినందుకు సక్సేనాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్ డిమాండ్ చేశారు. సంజయ్‌సింగ్ శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లెఫ్టినెంట్ గవర్నరుపై చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. కేవీఐసీ చైర్మన్‌గా కేవీ సక్సేనా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, 1961 నాటి కేవీఐసీ చట్ట నిబంధనలు ఉల్లంఘించారని సింగ్ తెలిపారు. తన కుమార్తెకు అక్రమంగా కాంట్రాక్టు కట్టబెట్టిన సక్సేనాను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు పదవి నుంచి తక్షణమే తొలగించాలని ఆయన ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో సీనియర్ న్యాయవాదులతో ఆప్ చర్చలు జరుపుతోందని, కోర్టుకు వెళ్లడానికి సమాయత్తమవుతోందని సింగ్ వివరించారు. 'ఈ అక్రమాల నుంచి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు తప్పించుకోలేరు. కాంట్రాక్టు ఇవ్వడానికి ఆయన కనీస నిబంధనలు పాటించలేదు. అందువల్ల మేము కోర్టుకెళతాం. కేవీఐసీ చైర్మన్‌గా ఓ కాంట్రాక్టును ఆయన కుమార్తెకు ఎలా కట్టబెడతారు' అని సింగ్ ప్రశ్నించారు. ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్(కేవీఐసీ) చైర్మన్‌గా టెండర్లు పిలవకుండానే కుమార్తెకు కాంట్రాక్టు ఎలా ఇస్తారని ఆయన నిలదీశారు. ఆప్ ఎంపీ ఆరోపణలపై సక్సేనా కార్యాలయం స్పందించింది. డిజైనర్ అయిన తన కుమార్తె ముంబైలోని ఖాదీ లాంజ్‌లో ఇంటీరియర్ డిజైన్ పనులను ఉచితంగా చేసినట్లు సక్సేనా పేర్కొన్నారు. ఎల్‌జీ కార్యాలయం సమాధానంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సింగ్ స్పందిస్తూ తమ కుటుంబ సభ్యులకు కాంట్రాక్టు లేదా పని అప్పగిస్తే అధికారులు జైలుకెళతారని కేవీఐసీ చట్టం స్పష్టంచేస్తోందని చెప్పారు.

ఓటర్ల జాబితా వెల్లడించండి: మిస్త్రీకి థరూర్ లేఖ

న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ఓటర్ల జాబితాను ప్రచురించాల్సిందిగా కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం చైర్మన్ మధుసూదన్ మిస్త్రీకి ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. అదేవిధంగా ఓటర్ల జాబితాను బహిర్గతం చేయాల్సిందిగా అసోం ఎంపీ ప్రద్యుత్ బర్దోలోయ్ కూడా మిస్త్రీకి లేఖ రాశారు. ఓటర్ల జాబితాను బయటపెట్టాలన్న డిమాండ్లు పెరగడంతో దీనిపై పార్టీలో చర్చ తీవ్రతరమైంది. ఏఐసీసీ అధ్యక్ష పదవికి శశిథరూర్ పోటీ పడుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన లేఖకు ప్రాధాన్యత ఏర్పడింది. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలంటే అభ్యర్థిని పదిమంది పీసీసీ ప్రతినిధులు ప్రతిపాదించాల్సి ఉంది. తుది జాబితాలో ఎవరి పేర్లు ఉన్నాయో తెలుసుకోవడానికి ఓటర్ల జాబితాను బహిర్గతం చేయాలని, నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురికాకుండా ఉండాలంటే జాబితాలోని ప్రతినిధులు ప్రతిపాదకులుగా ఉండాల్సిన అవసరం ఉందని శశిథరూర్ లేఖలో పేర్కొన్నారు. పారదర్శకత కోసం ఓటర్ల జాబితాను బయటపెట్టాలని థరూర్‌తో పాటు మనీశ్ తివారీ, కీర్తి చిదంబరం కూడా డిమాండ్ చేశారు. అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ఓటర్ల పేర్లు బహిర్గతం చేయకపోవడంపై తివారీ అభ్యంతరం వెలిబుచ్చారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించడానికిగాను ఏఐసీసీ వెబ్‌సైట్‌లో ఓటర్ల జాబితాను పెట్టాలని కోరారు. తివారీ అభిప్రాయంతో థరూర్ కూడా ఏకీభవించారు. ఎవరి నామినేట్ చేస్తున్నారు..ఎవరు ఓటేస్తున్నారో అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టడం తప్పేమీ కాదని వ్యాఖ్యానించారు.

జార్ఖండ్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

సెరికెలా : జార్ఖండ్‌కు చెందిన సెరికెలా-ఖరస్వాన్ జిల్లాలో శుక్రవారం ఉదయం భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. కుచాయ్ పోలీసు స్టేషన్ ప్రాంతంలోని బరుదా అటవీ ప్రాంతం వద్ద సీఆర్‌పీఎఫ్‌కి చెందిన కోబ్రా, జార్ఖండ్ జాగ్వర్, రాష్ట్ర పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో సీపీఐ మావోయిస్టులు మరణించారని కొల్హన్ డివిజన్ పోలీసు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజయ్ లిండా తెలిపారు. సంఘటనా స్థలం వద్ద నుంచి రెండు మృతదేహాలతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. చివరి నివేదిక అందే సమయానికి భద్రతా బలగాలు, మావోయిస్టులు మధ్య కాల్పులు జరుగుతున్నాయని చెప్పారు.

బొగ్గు అక్రమ రవాణా కేసులో ఈడీ ఎదుట అభిషేక్

కోల్‌కతా : బొగ్గు అక్రమ రవాణా కేసులో విచారణకు సంబంధించి శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ హాజరయినట్లు అధికారులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ కోల్‌కతా సమీపంలోని సాల్ట్ లేక్‌లోని సీజీవో సముదాయంలోని దర్యాప్తు సంస్థ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. కాగా టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి బెనర్జీని ప్రశ్నించేందుకు ఈడీకి చెందిన ఐదుగురు అధికారుల బృందం గురువారం రాత్రి కోల్‌కతా చేరుకుంది. ఈ సందర్భంగా సీజీవో కాంప్లెక్స్ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేసుకు సంబంధించి బెనర్జీని ఈడీ గతంలో కూడా ప్రశ్నించింది.

అన్నాడీఎంకే అగ్రనేత పళనిస్వామే

పన్నీరు సెల్వంకు అనుకూల ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు

చెన్నై : పార్టీ నాయకత్వ వివాదంపై ఏఐఏడీఎంకె నేత కె.పళనిస్వామి అభ్యర్థనను మద్రాస్ హైకోర్టు శుక్రవారం ఆమోదించింది. ఓ పన్నీర్‌సెల్వంకు అనుకూలంగా జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎం.దురైస్వామి, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన డివిజన్ బెంచ్, జులై 11న జరిగిన ఏఐఏడీఎంకే జనరల్ కౌన్సిల్ (జీసీ) సమావేశాన్ని రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులను పక్కన పెట్టింది. జులైలో జరిగిన ఆ సమావేశంలో ప్రతిపక్ష నేత కె. పళనిస్వామిని పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా, అత్యున్నత పదవికి ఎన్నుకున్నారు. ఇదే సమావేశంలో పన్నీర్ సెల్వం పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. తాజా కోర్టు ఆదేశాలతో ఏఐఏడీఎంకే ఏకైక, అత్యున్నత నాయకుడిగా పళనిస్వామి స్థానం స్థిరపడింది. జూన్ 23 నాటికి యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించిన జస్టిస్ జి.జయచంద్రన్ ఆగస్టు 17 నాటి ఉత్తర్వులను డివిజన్ బెంచ్ రద్దు చేసింది. జూన్‌లో ఆ రోజున పన్నీర్ సెల్వం సమన్వయకర్తగా, పళనిస్వామి జాయింట్ కోఆర్డినేటర్‌గా ఉన్నారు.

పాదచారులపై దూసుకెళ్లిన కారు: ఆరుగురి దుర్మరణం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని ఆరావళి జిల్లాలో కారు బీభత్సం సృష్టించింది. దైవదర్శనం కోసం నడుచుకుంటూ వెళ్తున్నవారిపైకి కారు దూసుకెళ్లింది. దీంతో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. దాహోద్, ఆరావళి జిల్లాలకు చెందిన అనేక మంది బనాస్ కాంతా జిల్లాలోని అంబాజీ ఆలయానికి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆరావళి జిల్లాలోని కృష్ణాపూర్, మాల్‌పూర్ గ్రామాల మధ్య వేగంగా దూసుకొచ్చిన కారు వారిపైనుంచి వెళ్లింది. బలంగా ఢీకొట్టడంతో చాలా మంది అంత ఎత్తు ఎగిరి కిందపడిపోయారు. దీంతో ఆరుగురు దుర్మరణం చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కారు టైరు పేలడంతో అదుపుతప్పిందని పోలీసులు తెలిపారు. ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి భూపిందర్ పటేల్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు, గాయపడినవారికి నష్టపరిహారం ప్రకటించారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

నాసిక్ వద్ద మునిగిపోయిన ఆలయాలు

నాసిక్: మహారాష్ట్రలోని నాసిక్ వద్ద గోదావరి నది మరోసారి ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఆలయాలు నీటమునిగాయి. గోదావరి జన్మస్థలమైన నాసిక్-త్రయంబకేశ్వర్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఒక్కసారిగా వరద పోటెత్తడంతో నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. నీటిమట్టం పెరడగంతో నాసిక్ వద్ద ఆలయాలు నీటమునిగాయి. నదిపై ఉన్న బ్రిడ్జిని ఆనుకుని నీరు ప్రవహిస్తున్నది. దీంతో రెండుపక్కల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నాసిక్‌లో ఆలయాలు మునగడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. గత నెల 11న కూడా మహారాష్ట్రలోని గోదావరి పరీవాహకం లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో నాసిక్ వద్ద ఆలయాలు నీటమునిగాయి. కొన్ని రోజులపాటు ఆలయాలు నీటిలోనే ఉన్నాయి. గత రెండునెలల్లో తెలంగాణలో కూడా గోదావరి ఉగ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. భద్రాచలం వద్ద 75 అడుగుల ఎత్తు మేర నది ప్రవహించింది. దీంతో భద్రాచలం నీటమునిగింది.

పట్టుబడిన దొంగనోట్లలో 60 శాతం రూ.2 వేల నోట్లే !

న్యూఢిల్లీ : గతేడాది స్వాధీనం చేసుకున్న నకిలీ సొమ్ములో దాదాపు 60శాతం రూ.2వేల నోట్లేనని జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదిక తెలిపింది. నకిలీ నోట్లను రద్దు చేయడమే ప్రధాన లక్ష్యంగా 2016లో పెద్ద నోట్లను రద్దు చేశారు. నకిలీ నోట్లు బాగా చెలామణిలో వుంటున్నందున వాటిని అణచివేయాలంటే పెద్ద నోట్ల రద్దు తప్పదని ప్రభుత్వం ఆనాడు పేర్కొంది. కానీ, ఆ తర్వాత నకిలీ నోట్లను స్వాధీనం చేసుకోవడం బాగా పెరిగిందని ఆ నివేదిక వెల్లడించింది. 2021లో భారత్‌లో నేరాలు శీర్షికతో ఈ నివేదికను వెలువరించారు. గత సంవత్సరం స్వాధీనం చేసుకున్న మొత్తంలో రూ.20.39కోట్ల మేరకు నకిలీ నోట్లే వున్నాయి. ఇవన్నీ కూడా రూ.2వేల నోట్లే. పాత 500, వెయ్యి నోట్లను ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత 2వేల సంవత్సరంలో కొత్త 2వేలు, 500నోట్లు ప్రవేశపెట్టారు. 2016లో పట్టుకున్న నకిలీ కరెన్సీ రూ.15.92కోట్లు వుండగా, 2017, 2018, 2019, 2020, 2021ల్లో వరుసగా రూ.28.10, 17.95, 25.39, 92.17, 20.39కోట్లు వున్నాయి. పెద్ద నోట్ల రద్దుకు ముందు సంవత్సరం రూ.15.48కోట్ల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. 2020లో పెద్ద మొత్తంలో నకిలీ నోట్లు పట్టుబడడానికి కారణం పూనేలోని ఒక ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న డమ్మీ నోట్లే. 2020 జూన్ 10న పోలీసులు 82.8కోట్ల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో 43కోట్లు కేవలం రూ.2వేల నోట్లే వున్నాయి. అవి పూణే ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నవే. ఇందుకు సంబంధించి సైనికాధికారితో సహా ఆరుగురిని అరెస్టు చేశారు. డాలరు బిల్లులను రూపాయిల్లోకి మార్చుకునే సమయంలో డమ్మీ డబ్బును నిందితుడు ఉపయోగించేవారని పోలీసులు కనుగొన్నారు. 2021లో 6.6కోట్ల సొమ్ము 500రూపాయిల నకిలీ నోట్లలో వుందని, 200రూపాయిల నకిలీనోట్లతో 45లక్షలు కూడా వున్నాయని ఎన్సీఆర్బీ నివేదిక పేర్కొంది.

రహదారిలేక ‘డోలి’లో గర్భిణికి కష్టం

ఆస్పత్రికి వెళుతూ మృత శిశువుకు జన్మనిచ్చిన మహిళ

థానే: దేశంలో అనేక మారుమూల ప్రాంతా ల్లో ప్రజలకు కనీస సదుపాయాలు మృగ్యమ య్యాయి. సరైన వైద్య, రహదారి సౌకర్యాలు కరవై ప్రజలు తీవ్ర నరకయాతన పడుతున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలోని ఒక కుగ్రామానికి చెందిన గర్భిణీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) కి వెళ్లే మార్గంలో మృత శిశువుకి జన్మనిచ్చింది. అయితే గర్భిణీ అయిన ఆమెను ముందుగా ఆస్పత్రిలో చేరాలని చెప్పినట్లు ఆరోగ్య అధికారి తెలిపారు. దాదాపు 25 కుటుంబాలతో కూడిన తన కుగ్రామానికి సరైన దారి లేకపోవ డంతో 26 ఏళ్ల మహిళ డోలీలో వైద్య కేంద్రానికి తీసుకువెళుతుండగా వెళ్లే మార్గంలో ఆమె మృత శిశువును ప్రసవించినట్లు థానే జిల్లా అధికారులు శు క్రవారం తెలిపారు. ఈ ఘటన గురువారం భివాండి తాలూకా ధిగాషి గ్రామంలోని ధర్మచాపా డలో జరిగినట్లు వారు ధ్రువీకరించారు. ‘గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో దర్శన కర్లేను డోలీలోని వైద్య కేంద్రానికి తీసుకువెళుతుండగా ఆమెకు ప్రసవమయింది. దీంతో ఆమెతో పాటు ఉన్నవారు తిరిగి గ్రామానికి తీసుకువెళ్లారు. దర్శన కర్లేకు ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి ఉన్నారు. ఇది ఆమెకు నాల్గవ సంతానం’ అని ఆయన చెప్పాడు. గణేష్‌పురి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ మాధవ్ కర్లే మాట్లాడుతూ సంఘటన గురించి తెలుసుకున్న తాను కుగ్రామాన్ని సందర్శించానని, ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆమెకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ‘ఆగస్టు 24న ఆ మహిళ సాధారణ ఆరోగ్య పరీక్ష కోసం పీహెచ్‌సీకి వచ్చింది. ఆమె ప్రసవ తేదీకి సమీపంలో ఉన్నందున ఆస్పత్రిలో చేరవలసిందిగా సలహా ఇచ్చారు. అయితే, దర్శన కర్లే, ఆమె బంధువులు బట్టలు తీసుకోవడానికి తిరిగి వెళ్లాలని చెప్పారు. వారు తిరిగి రాలేదు. పీహెచ్‌సీకి చెందిన ఒక నర్సు ఆగస్టు 26న ఆమెను సందర్శించింది’ అని కర్లే వివరించారు. ‘ఒకట్రెండు రోజుల్లో తన భార్య ఆస్పత్రిలో చేరుతుందని ఆమె భర్త నర్సుతో చెప్పాడు. ఇక్కడి అంబాడిలోని వారంతాపు మార్కెట్‌ను సందర్శించి నప్పుడు కూడా ఆమెను ఆస్పత్రిలో చేర్పించాలని చెప్పారు. అయితే, వారు ఆలస్యం చేయడంతో ఆమె గురువారం ఒక బిడ్డను ప్రసవించింది’ అని పీహెచ్‌సీ అధికారి తెలిపారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి

సీజేఐ లలిత్

న్యూఢిల్లీ : సాధ్యమైనన్ని కేసులను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు కృషి చేస్తుందని, ప్రజల అంచనాలను అందుకునే ప్రయత్నం చేస్తుందని సీజేఐ యూయూ లలిత్ శుక్రవారం అన్నారు. భారత బార్ కౌన్సిల్ నిర్వహించిన సన్మానసభలో ఆయన మాట్లాడారు. ఎక్కువ సంఖ్యలో కేసుల లిస్టింగ్ జరుగుతోందని, ఇప్పటికే 1,293 వ్యవహారాలను పరిష్కరించామని, 106 కేసుల విచారణ వ్యవహారాలను నాలుగు రోజుల్లో పరిష్కరించినట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో 440 బదిలీ పిటిషన్లను పరిష్కరించినట్లు వెల్లడించారు. సాధ్యమైనంత మేరకు కేసుల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. అలా చేసి మరో మూడు నెలల్లో మరిన్ని పుష్పగుచ్ఛాలను అందుకొనేలా నిజాయితీగా పనిచేస్తానని జస్టిస్ లలిత్ అన్నారు. తనకు ఆత్మీయ స్వాగతం లభించగా అందిన పుష్పాలు, పుష్పగుచ్ఛాలను తీసుకెళ్లేందుకు ట్రక్కు కావాలంటూ చమత్కరించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. బీసీఐ చైర్మన్, సీనియర్ న్యాయవాది మనాన్ కుమార్ మిశ్రా స్వాగతోపన్యాసం చేశారు. జస్టిస్ లలిత్ 49వ సీజేఐగా నియమితులు కావడం దేశంలోని అందరు న్యాయవాదులకు గర్వకారణమని అన్నారు. కేసుల లిస్టింగ్‌లో పారదర్శకత ఉండేలా చూస్తానని సీజేఐ చెప్పారు.

కేరళలో మోదీకి నో ఛాన్స్

నితీశ్ కుమార్
ఆ రాష్ట్ర రాజకీయాలు అందరికీ తెలుసని వ్యాఖ్య



పాట్నా: ప్రధాని కాబట్టి ఎక్కడికైనా వెళతారు.. ఏమైన మాట్లాడతారుగానీ కేరళ రాష్ట్ర రాజకీయాలు ఎవరికీ తెలియనవి కాదు.. అంటూ మోదీపై బీహార్ సీఎం నితీశ్ కుమార్ విమర్శలు గుప్పించారు. ఆ రాష్ట్రంలో బీజేపీ పదేపదే విఫలం కావడాన్ని ఎత్తిచూపారు. చిరునవ్వుతో ఆ పార్టీకి చురకలు అంటించారు. కేరళలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై నితీశ్ స్పందించారు. ‘ప్రధానిగా ఉండి ఆయన ఎక్కడకైనా వెళ్లవచ్చుగానీ కేరళలో రాజకీయ పరిస్థితి మీకు తెలియదా’, అంటూ నితీశ్ చిరునవ్వు చిందించారు. వామపక్ష పాలిత రాష్ట్రంలో బీజేపీ వరుస వైఫల్యాలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అక్కడ ఎల్డీఎఫ్, యూడీఎఫ్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూ ఉంటుంది. మరోవైపు బీహార్ మహాకూటమిలో కాంగ్రెస్, లెఫ్ట్‌కు భాగస్వామ్యం ఉంది. ‘అవినీతిపరులను కాపాడేందుకు రాజకీయ విభజన’ అంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలను నితీశ్ దుయ్యబట్టారు. తెలంగాణ సీఎం చంద్రశేఖరరావుతో భేటీపై మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ‘నాకు వాజ్‌పేయి నేతృత్వంలో పనిచేసే అవకాశం దక్కింది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న వారు ఏమి అనుకున్నా.. చెప్పుకున్నా నేను పట్టించుకోను’ అని అన్నారు. 1990 నుంచే తాను జాతీయ రాజకీయాల్లో ఉన్నానని ఈ వ్యాఖ్యలతో నితీశ్ చెప్పకనే చెప్పారు. అవినీతిపై కేంద్రం ఉక్కుపాదం మోపుతుండటంతో ప్రతిపక్షాలు గోల చేస్తున్నట్లు మోదీ చెప్పడాన్ని నితీశ్ ఆక్షేపించారు. గతంలో అవినీతిపరులుగా ఆరోపణలు ఎదుర్కొన్న వారితో బీజేపీ అనేకరాష్ట్రాల్లో జతకట్టిందంటూ చరకలు అంటించారు. ‘అవినీతికి కవచం ఎవరు? అలా చేయాలని ఎవరైనా అనుకుంటారా? వివిధ రాష్ట్రాల్లో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి, జనం ఇటు నుంచి అటు వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఇది అందరికీ తెలుసు. దీని గురించి ఎక్కువగా మాట్లాడాలని అనుకోవడం లేదు’ అని నితీశ్ కుమార్ అన్నారు. జాతీయ రాజకీయాల్లో నితీశ్ పాత్రపై ప్రస్తుతం అనేక ఊహాగానాలు ఉన్న క్రమంలో ప్రధాన మంత్రి రేసులో లేనని ఆయన మరోసారి స్పష్టంచేశారు. శుక్రవారం జేడీ(యూ) కేంద్రకార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడిన ఆయన ఇటువంటి ప్రశ్నలను వదిలేయండి అని సూచించారు. శనివారం జరగబోయే జాతీయ కార్యవర్గం, ఆదివారం జరిగే జాతీయ మండలి సమావేశాల ఏర్పాట్లను సమీక్షించేందుకు వచ్చినట్లు తెలిపారు. ‘దేశ నలుమూలల నుంచి ప్రతినిధులు వస్తారు. నేను కేవలం ఏర్పాట్లను చూసేందుకు వచ్చాను. వచ్చే రెండు రోజులు ఇక్కడే ఉంటాను’ అని నితీశ్ కుమార్ అన్నారు. ఇదిలావుంటే, దేశవ్యాప్తంగా బీజేపీకి వెయ్యి మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. 300 మంది ఎంపీలు ఉన్నారు. ఇప్పటివరకు ఎవరిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు జరపలేదు. వాళ్లు కడిగిన ముత్యాలా? అని ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. ఆ పార్టీ నేతలను ఎవరో కాపాడుతున్నారనడంలో సందేహమే లేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. బీజేపీలో చేరినా లేక ఆ పార్టీతో జతకట్టిన మరు క్షణం అప్పటివరకు ఎదుర్కొన్న అవినీతి ఆరోపణలు కనుమరుగవుతాయి. ఇలాంటి అనేక మందిని మనం చూశామని ఆయనన్నారు.

ఎనిమిదేళ్లలో ప్రగతిశీల పాలన : మోదీ ప్రగల్భాలు

మంగళూరు : ఆధునిక మౌలికవసతుల అభివృద్ధియే భారత అభివృద్ధికి మార్గమని ప్రధాని మోదీ శుక్రవారం అన్నారు. ప్రజలు ఆకాంక్షించేది కూడా అదేనన్నారు. అభివృద్ధి, ప్రగతిశీల పనుల ఘనత మొత్తం తమ డబుల్ ఇంజిన్ ప్రభుత్వానిదని కర్ణాటకలో జరిగిన కార్యక్రమంలో చెప్పుకున్నారు. కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. అమృత్ కాల్‌లో జాతీయ లక్ష్యాల సాధనకు అభివృద్ధి పథమే మార్గమని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రేయింబవళ్లు శ్రమిస్తోందని అన్నారు. రూ.3,800 కోట్ల విలువ చేసే పారిశ్రామిక ప్రాజెక్టులను చేపట్టినట్లు వెల్లడించారు. న్యూ మంగళూరు పోర్టు యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రాజెక్టులు ఉన్నాయని, పోర్టు పరిధిలో రూ.వెయ్యి కోట్ల విలువ చేసే ఐదు ప్రాజెక్టుల కోసం శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. మేకిన్ ఇండియా విస్తరించాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ఎగుమతులు పెరగాలని, మన ఉత్పత్తులు విశ్వవ్యాప్తం కావాలని మోదీ అన్నారు. చౌవకైన- సులభతర లాజిస్టిక్స్ లేకుండా ఇది సాధ్యం కాదని చెప్పారు. కోస్తా మౌలిక వసతులను సాగర్ మాలా ద్వారా, రోడ్డు మౌలిక వసతులను భారత్ మాలా ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. స్వచ్ఛమైన తాగు నీరు, వైద్య, సామాజిక భద్రత, పక్కా ఇళ్ల కల్పనకు; ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిజిటల్ లావాదేవీలు పెరగడం, చవకగా ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం వంటివి ప్రస్తావించారు. గతేడాది ప్రపంచం మొత్తం ఒడిదుడుకులకు లోనైనప్పటికీ భారత్ మొత్తం ఎగుమతుల విలువ 670 బిలియన్ డార్లుగా అంటే రూ.50లక్షల కోట్లుగా ఉన్నట్లు తెలిపారు. దేశ ఆర్థిక వృద్ధితో ముడిపడి ఉన్న ప్రతి రంగం వేగంగా సమర్థంగా అభివృద్ధి చెందుతోందని మోదీ అన్నారు.

ఉత్తరాఖండ్‌లో పరువు హత్య

అగ్రవర్ణ యువతిని పెళ్లాడినందుకు దళితుడిని చంపేసిన ఘటన

పితోర్‌గఢ్ : దేశంలో కొన్నాళ్లుగా పరువు హత్యలు కొనసాగుతున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో ఉన్నత కులానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నందుకు దళిత వ్యక్తిని అతని అత్తమామలు హత్య చేశారు. పనుఅధోఖాన్ గ్రామానికి చెందిన దళిత రాజకీయ కార్యకర్త జగదీశ్ చంద్ర శుక్రవారం భికియాసైన్ పట్టణంలో కారులో శవమై కనిపించినట్లు ఉప్పు సబ్ డివిజన్ తహసీల్దార్ నిషా రాణి తెలిపారు. అతని భార్య తల్లి, సవతి తండ్రి, సవతి సోదరుడు మృతదేహాన్ని పారవేసేందుకు కారులో తీసుకువెళుతుండగా పట్టుకున్నారని, వారిని వెంటనే అరెస్టు చేసినట్లు తహసీల్దార్ వివరించారు. ఈ జంట ఆగస్టు 21న వివాహం చేసుకున్నారని, గురువారం జగదీశ్ చంద్రను అత్తమామలు కిడ్నాప్ చేశారని తెలిపారు. కాగా ఆగస్టు 27న తమ ప్రాణాలకు ముప్పు ఉన్నందున రక్షణ కల్పించాలని కోరుతూ దంపతులు పాలనా యంత్రాంగానికి లేఖ రాశారని ఉత్తరాఖండ్ పరివర్తన్ పార్టీ నాయకుడు పి.సి.తివారీ తెలిపారు. బాధితుడి ఉప్పు అసెంబ్లీ స్థానం నుంచి పార్టీ గుర్తుపై రెండుసార్లు ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. భార్యాభర్తల ఫిర్యాదుపై ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉంటే చంద్రను కాపాడి ఉండేవారని తివారీ చెప్పారు. ఈ హత్య ఉత్తరాఖండ్‌కు సిగ్గుచేటని పేర్కొంటూ, బాధితుడి భార్యకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తగ్గనున్న వంటనూనె ధరలు..

న్యూఢిల్లీ : వంట నూనెలపై అమలు చేస్తున్న రాయితీ కస్టమ్స్ సుంకాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్టు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. 2023 మార్చి 31 వరకు ఈ విధానం కొనసాగుతుందని ఉత్తర్వుల్లో వెల్లడించింది. తద్వారా వంట నూనెల సరఫరా పెరగడమే కాకుండా ధరలు నియంత్రణలో ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేసింది. పామాయిల్, సోయా ఆయిల్, పొద్దు తిరుగుడు నూనెపై ప్రస్తుత సుంకాలే రాబోయే ఆరు నెలలు కొనసాగుతాయని తెలిపింది. ప్రస్తుతానికి వీటిపై సుంకాలు లేవు. కానీ 5 శాతం అగ్రిసెస్, వెల్ఫేర్‌సెస్ కలుపుకుని 5.5 శాతం పన్ను అదనంగా పడుతోంది. పామాయిల్‌పై 13.75 శాతం, రిఫైన్డ్ సోయాబీన్ ఆయిల్‌పై 19.25 శాతం రాయితీ సుంకం అమల్లో ఉంది. వంట నూనె విషయంలో మోసాలకు పాల్పడుతున్న కంపెనీల దృష్ట్యా కేంద్రం పలు చర్యలు తీసుకున్న విషయ తెలిసిందే. వారం రోజుల క్రితం పామోలిన్ ఆయిల్ ధర లీటరుకు రూ.10-12 తగ్గింది. ప్రస్తుతం కిలో పామోలిన్ ధర రూ.114.50గా ఉంది. ఆ తర్వాత కిలో ధర రూ.101-102గా ఉండవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రిటైల్ వ్యాపారులు మాత్రం దాదాపు రూ. 50 ఎక్కువగా విక్రయిస్తున్నారు. ఎంఆర్‌పీ వాస్తవ ధర కంటే రూ. 10-15 మించకూడదు. వినియోగదారులకు సరఫరా చేసే రిఫైనింగ్ కంపెనీలకు ప్రభుత్వం దిగుమతులపై సుంకాన్ని మినహాయించడం ధరలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. ఆవాలు, వేరుశెనగ, నువ్వుల నూనెపై జీఎస్‌టీ అమలవుతుండగా పత్తి గింజల కేక్‌పై జీఎస్టీ లేదు.

గంపాను సత్కరిస్తున్న రామకృష్ణ, ముప్పాళ్ల, జల్లి విల్సన్, హరినాథరెడ్డి, మనోహర్‌నాయుడు, అక్కినేని వనజ, దోనేపూడి

‘గంపా’ సేవలు అమోఘం

సత్కరించిన విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకవర్గం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దాదాపు సుదీర్ఘకాలంగా విశాలాంధ్ర ప్రచురణా సంస్థలకు టెక్నికల్ ఇంజనీర్ గంపా శ్రీనివాసరావు అందిస్తున్న సేవలు అమోఘమని విశాలాంధ్ర విజ్ఞాన సమితి నేతలు కొనియాడారు. విశాలాంధ్ర 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనను శుక్రవారం ప్రత్యేకంగా విశాలాంధ్ర కార్యాలయంలో దుశ్శాలువ, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డు చైర్మన్ కె.రామకృష్ణ, విజ్ఞాన సమితి అధ్యక్ష, కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, జనరల్ మేనేజర్ పి.హరినాథ రెడ్డి, డీజీఎం మనోహర్ నాయుడు. సభ్యులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్ గంపాను సత్కరించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తనను సత్కరించిన విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకవర్గానికి గంపా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రింటింగ్ టెక్నాలజీలో పట్టా తీసుకున్న తాను 1985లో విజయవాడ ప్రథమ మేయర్ టి.వెంకటేశ్వరరావు విశాలాంధ్ర జీఎంగా ఉన్న సమయంలో ఈ సంస్థలో ఉద్యోగిగా చేరానని తెలిపారు.

ఆ రోజుల్లో లెటర్ ప్రెస్ ఉండేదని, క్రమేపీ ఆఫ్‌సెట్‌లో ముద్రణ వరకు వరుసగా వచ్చిన మార్పులను గంపా గుర్తు చేశారు. సాంకేతికరంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా విశాలాంధ్రలో ఆధునిక యంత్రాలను ప్రవేశపెట్టడం, దీనిలో భాగంగా కలర్‌మిషన్స్ ఏర్పాటుతో పాటు ప్రింటింగ్ నాణ్యతను ఎప్పటికప్పుడు మెరుగుపర్చే విషయంలో గంపా అందించిన సేవలను విజ్ఞాన సమితి ప్రశంసించింది.



రద్దయిన వైద్య కళాశాలల అభ్యర్థన తిరస్కృతి

విశాలాంధ్ర- హైదరాబాద్: వసతులు లేని కారణంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలు రద్దయిన విద్యార్థులను ఇతర కాలేజీల్లో సర్దుబాటు చేయాలన్న గత ఉత్తర్వుల అమలును నిలివేయాలనే ప్రైవేట్ మెడికల్ కాలేజీల అభ్యర్థనను తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చింది. రద్దయిన కాలేజీల విద్యార్థులను ఇతర కాలేజీల్లోకి సర్దుబాటు చేసేందుకు అనుమతిస్తూ గతంలో తామిచ్చిన మధ్యంతర ఉత్తర్వులు తుది తీర్పుకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. తగిన వసతులు లేని కారణంగా కాలేజీల అనుమతులను రద్దు చేసిన తరుణంలో ఆ కాలేజీల్లోని విద్యార్థులను ఇతర కాలేజీల్లోకి సర్దుబాటు చేయాలన్న గత హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ టీఆర్ఆర్, మహవీర్ మెడికల్ కాలేజీలు వేర్వేరు వ్యాజ్యాలు దాఖలు చేశాయి. వీటిని న్యాయమూర్తులు అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ కే శరత్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది.

పూర్తిగా దురుద్దేశపూరితం

ఇందు మల్హోత్రా వ్యాఖ్యలపై నిరసన

న్యూఢిల్లీ: ఆదాయం కోసమే కమ్యూనిస్టు ప్రభుత్వాలు హిందూ దేవాలయాలను స్వాధీనం చేసుకున్నాయని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందు మల్హోత్రా చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె వ్యాఖ్యలు నిరాధారమైనవి, దురుద్దేశంతో కూడినవని కేరళ ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్, ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి రాధాకృష్ణ తదితరులు పేర్కొన్నారు. వాస్తవాలు తెలియకుండా యథేచ్ఛగా ఆరోపణలు చేశారని న్యాయ నిపుణులు, చరిత్రకారులు సైతం వ్యాఖ్యానించారు. హిందూ దేవాలయాలను కమ్యూనిస్టు ప్రభుత్వాలు స్వాధీనం చేసుకుంటున్నాయంటూ జస్టిస్ ఇందు మల్హోత్రా చేసిన వ్యాఖ్యను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ తీవ్రంగా ఖండించారు. జస్టిస్ మల్హోత్రాను ఎవరో తప్పుదారి పట్టించినట్టుంది, బహిరంగంగా అలాంటి వ్యాఖ్యలు చేసే ముందు వాస్తవాలను ఆమె తెలుసుకుంటే బాగుండేదని అన్నారు. ఈ విషయంలో మల్హోత్రాకు ఎవరో తప్పుడు సమాచారం అందించారని ఆయన అన్నారు. చరిత్రకారులు కె.ఎన్ గణేష్, జె.ప్రభాష్, జె రఘు కూడా మల్హోత్రా వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ఫాసిస్టు శక్తులకు మరింత ఊతమిచ్చేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. దేవస్థాన బోర్డు నిర్వహించే దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయం కన్నా, ప్రభుత్వ ఖజానా నుంచి దేవస్థాన బోర్డుకు ప్రభుత్వం ఇచ్చే నిధులే ఎక్కువ అని కేరళ దేవాదాయ శాఖ మంత్రి రాధాకృష్ణ అసెంబ్లీలో సవివరంగా తెలిపారు. శబరిమలలో రహదారుల అభివృద్ధితోపాటు అనేక పనులకు ప్రభుత్వ నిధులు వినియోగిస్తున్నామని అన్నారు. జస్టిస్ మల్హోత్రా చేసిన నిరాధారమైన ఆరోపణలతో కూడిన వీడియో ను సంఘ్‌పరివార్ డిజిటల్ వర్సిటీలు సోషల్ మీడియాలో వైరల్ చేశాయి. ఆ వీడియోలో ఒక మహిళ జస్టిస్ ఇందుతో మాట్లాడుతూ “మేము మిమ్మల్ని చూసి గర్విస్తున్నాము. మీరు అద్భుతంగా పని చేశారు” అని చెప్పడం వినబడింది. 2020 సుప్రీం కోర్టు తీర్పులో జస్టిస్ మల్హోత్రా, జస్టిస్ యుయు లలిత్ ఆలయ నిర్వహణపై ట్రావెన్‌కోర్ రాజకుటుంబం హక్కులను సమర్థించారు. దీనిపై జస్టిస్ మల్హోత్రా స్పందిస్తూ “... మీరు వారిని పరిపాలన నుండి ఎలా మినహాయిం చగలరు? ఈ కమ్యూనిస్టు ప్రభుత్వాలతో అదే జరుగుతోంది, వారు కేవలం ఆదాయం కారణంగా స్వాధీనం చేసుకోవాల నుకుంటున్నారు. వారి సమస్య ఆదాయమే. వారు మొత్తం హిందూ దేవాలయాలను మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. కాబట్టి జస్టిస్ లలిత్, నేను దాన్ని జరగకుండా చేశాం, అనుమతించలేదు” అని ఆమె వీడియోలో చెప్పారు.

జస్టిస్ ఇందు మల్హోత్రా చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని, స్థూలమైన అపార్థం ఆధారంగా ఉన్నాయని కేరళ దేవాదాయ మంత్రి కె. రాధాకృష్ణన్ సమాధానం ఇచ్చారు. కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఏ ఒక్క హిందూ దేవాలయాన్ని స్వాధీనం చేసుకోలేదని, హిందూ మతంలోని అన్ని వర్గాలకు పూజలు చేసుకునే హక్కును సాధించేందుకు కమ్యూనిస్టు పార్టీలు చేసిన పోరాటాలు చరిత్రలో భాగమన్నారని పేర్కొన్నారు. వామపక్ష ప్రభుత్వాలు అన్ని వర్గాల పూజలు, విశ్వాసాలను పరిరక్షిం చేందుకు చర్యలు చేపట్టాయని తెలిపారు. వామపక్ష ప్రభుత్వాల హయాంలోనే అన్యాక్రాంతమైన దేవస్థాన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం, ఆలయ ఉద్యోగులకు క్రమపద్ధతిలో వేతనాలు చెల్లించడం, ఒకప్పుడు ఆలయ ప్రాంగణంలోకి కూడా ప్రవేశం నిరాకరిస్తున్న వారిని ఆలయ ఉద్యోగులుగా మార్చడం జరిగిందని గుర్తు చేశారు. ఆలయ ఆదాయాన్ని ప్రభుత్వం లాక్కోవాలని రాడికల్ హిందుత్వ శక్తులు చాలా కాలంగా చేస్తున్న ప్రచారం రిటైర్డ్ జడ్జిని కూడా ప్రభావితం చేసి ఉండవచ్చని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేపై చేయిచేసుకున్న భర్త

మహిళా కమిషన్ ఆగ్రహం

అమృతసర్: దేశంలో మహిళలపై గృహహింస కేసులు పెరుగుతున్నాయి. ప్రజా ప్రతినిధులైనప్పటికీ మహిళలు ఈ హింసను ఎదుర్కోవలసి రావడం విచారకరం. తాజాగా ఒక ఎమ్మెల్యేపై భర్త చేయిచేసుకున్న ఘటన పంజాబ్‌లో జరిగింది. అందరూ చూస్తుండగానే ఆప్ ఎమ్మెల్యే బల్జిందర్ కౌర్‌పై ఆమె భర్త చెంపపై కొట్టారు. పంజాబ్‌లోని తన నివాసంలో జులై 10న జరిగిన ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పంజాబ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బ్రిందర్ ఈ వీడియో ను ట్విటర్‌లో పోస్ట్ చేశారు. పంజాబ్‌లోని తాల్వండి సాబో నియోజకవర్గ ఎమ్మెల్యే బల్జిందర్ కౌర్, ఆమె భర్త సుఖ్‌రాజ్ సింగ్ మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన సుఖ్‌రాజ్ అందరూ చూస్తుండగానే బల్జిందర్‌పై చేయిచేసుకున్నారు. పక్కనున్నవారు ఆయనను అడ్డుకున్నారు. ఈ ఘటనపై పంజాబ్ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజా సమస్యలను లేవనెత్తే మహిళలు ఇంట్లోనే వేధింపులు ఎదుర్కోవడం దారుణమని పేర్కొంది. ఈ ఘటనను సుమోటోగా పరిగణిస్తూ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ ఘటనపై బల్జిందర్ కౌర్ స్పందించలేదు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు పేర్కొన్నారు. పంజాబ్‌లో మహిళలపై నేరాలు 17 శాతం పెరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక పేర్కొంది. 2020లో 4,838 కేసులు ఉండగా 2021 నాటికి ఈ కేసుల సంఖ్య 5,662కి పెరిగింది. అలాగే 2020లో 504 అత్యాచార కేసులు నమోదు కాగా, 2021 నాటికి ఈ కేసుల సంఖ్య 508కి చేరింది.

45 వేల ఖాతాలపై ట్విట్టర్ నిషేధం!

న్యూఢిల్లీ: నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో భారత్‌లో కొత్తగా 45 వేల ఖాతాలను నిషేధించినట్లు ట్విట్టర్ వెల్లడించింది. వీటన్నింటిని జులై నెలలోనే నిషేధించినట్లు తెలిపింది. ఇలా నిషేధించిన ఖాతాల్లో 42,825 ఖాతాలు చిన్నపిల్లల సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్ నిబంధనలు ఉల్లంఘించాయని, ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించాయని, అలాగే కన్సెంట్ లేని న్యూడిటీని కూడా ప్రమోట్ చేశాయని ట్విటర్ తెలిపింది. మిగతా 2,366 ఖాతాలు ఉగ్రవాదాన్ని ప్రమోట్ చేయడంతో బ్యాన్ చేసినట్లు వివరించింది. అంతకుముందు జూన్ నెలలో కూడా 43 వేల భారతీయ ఖాతాలను ట్విట్టర్ బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే.

ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడిగా కల్యాణ్ చౌబే ఎన్నిక

న్యూఢిల్లీ: అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) అధ్యక్షుడిగా కల్యాణ్ చౌబే ఎన్నికయ్యారు. ఎన్నికల్లో భారత మాజీ కెప్టెన్ బైచాంగ్ భూటియా పోటీ చేశారు. కానీ భూటియా అనూహ్య రీతిలో ఓటమి పాలయ్యారు. భూటియాకు కేవలం ఒకే ఒక ఓటు పడింది. చౌబేకు 33 ఓట్లు పోలయ్యాయి. కల్యాణ్ చౌబే వయసు 45 ఏళ్లు. మాజీ ఆటగాడు అయిన చౌబే గతంలో మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ జట్లకు ఆడాడు. 34మంది సభ్యులు కలిగిన ఓటర్ల జాబితాలో భూటియాకు మద్దతుదారులు కరువయ్యారు. చౌబే గత పార్లమెంట్ ఎన్నికల్లో బెంగాల్‌లోని కృష్ణానగర్ సీటు నుంచి పోటీపడి ఓడిపోయారు. ఇండియా సీనియర్ జట్టుకు ఆయనెప్పుడూ ఆడలేదు. కానీ అనేక మార్లు జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. భారత్ తరపున ఏజ్ గ్రూపు ఇంటర్నేషనల్ టోర్నీల్లో మాత్రం ప్రాతినిధ్యం వహించాడు. ఈస్ట్ బెంగాల్ జట్టుకు ఓ దశలో భూటియా, చౌబేలు కలిసి ఆడారు. ఉపాధ్యక్షుడి పోస్టుకు పోటీపడ్డ కర్ణాటక ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ ఏ హారిస్ గెలిచారు. రాజస్థాన్‌కు చెందిన మన్వేందర్ సింగ్‌పై ఆయన విజయం సాధించాడు. ట్రెజరరీ పోస్టును అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన కిపా అజయ్ గెలిచాడు.

సమష్టి కృషితోనే ఇది సాధ్యం

ఐఎన్ఎస్ విక్రాంత్ జలప్రవేశంపై జైరాంరమేశ్

న్యూఢిల్లీ: దేశీయంగా తయారైన తొలి ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక నౌకా దళంలోకి చేరిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరును కాంగ్రెస్ పార్టీ తప్పు పట్టింది. 1999 నుంచి అనేక ప్రభుత్వాల సమిష్టి ప్రయత్నాలతోనే ఐఎన్ఎస్ విక్రాంత్ నౌకాదళంలోకి తీసుకురాగలిగామని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తించారా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఐఎన్ఎస్ విక్రాంత్ శుక్రవారం నౌకా దళంలోకి ప్రవేశించడం 1999 నుంచి అనేక ప్రభుత్వాలు సాగించిన సమిష్టి కృషికి ఫలితం కాదా అని ఆయన ప్రధాని మోదీని నిలదీశారు. 1971 యుద్ధంలో భారత్‌కు ఎంతో ఉపయోగపడిన అసలైన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను కూడా గుర్తుచేసుకోవాలని అన్నారు. బ్రిటన్ నుంచి దానిని తీసుకురావడంలో కృష్ణ మీనన్ కీలక పాత్ర పోషించారని జైరాం రమేశ్ ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.